https://epaper.dksaardyamlochaatimpu.com






E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 సంచిక : 302 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | బుధవారం, సెప్టెంబర్,2, 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

## హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 1 : హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వం లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లకు ఆసక్తి చూపిస్తోందని తెలిపారు. హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనుందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో కోర్సులు, ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని చెప్పుకొచ్చారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజ్‌తో చర్చలు సానుకూలంగా జరిగాయని వివరించారు. నాదీూ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌తోనూ సానుకూల ఫలితాలు వచ్చాయని తెలిపారుఅమెరికాలోని ఇతర ప్రముఖ విశ్వవిద్యాలయాలతోనూ చర్చలు ఫలప్రదమయ్యాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంయుక్త పరిశోధనలు,



సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఓ ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ విద్యా శక్తికేంద్రంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## మోదీతో పుతిన్, జిన్‌పింగ్ భేటీ..


**న్యూఢిల్లీ,సెప్టెంబర్,01:**కిర్గిస్తాన్‌లో జరుగుతున్న ఎస్‌సీవో సదస్సులో అరుదైన భేటీ జరిగింది. చాలా కాలం తర్వాత ప్రధాని మోదీతో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ అయ్యారు. ముగ్గురూ ఒకేసారి వేదికపై చేరి, ఒకరికొకరు కరచాలనం చేసుకున్నారు. ముగ్గురూ కొద్దిసేపు సంభాషించుకున్నారు. కిర్గిస్తాన్‌లోని బిష్కెక్‌లో 26వ ఎస్‌సీవో సదస్సు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా మోదీ, పుతిన్, జిన్‌పింగ్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నెలలోనే మోదీ, జిన్‌పింగ్ మరోసారి భేటీ కానుండటం విశేషం. ఈ నెల 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు జిన్‌పింగ్ హాజరుకానున్నారు. దీంతో మరోసారి మోదీ, జిన్‌పింగ్ భేటీ కావడం ఖాయం. ఈ పర్యటన సందర్భంగా ఇరువురు నేతల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరగనున్నాయి. ఇక, ఎస్‌సీవో సదస్సులో మోదీ మాట్లాడారు. పక్కనే ఉన్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముందే తీవ్రవాదం గురించి మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. తీవ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని మోదీ అన్నారు. తీవ్రవాదాన్ని అన్ని రూపాల్లో



అణిచివేయాలని, తీవ్రవాదులకు నిధులు అందించడం, నియామాకాలు చేపట్టడం, ఉగ్రవాదంవైపు ప్రజల్ని నడిపించడం వంటివి ఆపేయాలని సూచించారు. యుద్ధాలతో సమస్య పరిష్కారం కాదని, ద్వైపాక్షిక చర్చలు, రాయబారం వల్లే సమస్యలు పరిష్కారమవుతాయని మోదీ అన్నారు. అంతకుముందు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఉక్రెయిన్‌తో యుద్ధం గురించి పుతిన్‌తో చర్చించినట్లు చెప్పారు.

## కూతురి వ్యాఖ్యల దుమారం!

### అధిష్ఠానం పిలుపుతో హుటాహుటిన ఢిల్లీకి కొండా సురేఖ



**హైదరాబాద్,సెప్టెంబర్,01:**తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ అంశం ఉత్కంఠను రేపుతున్న సంగతి తెలిసిందే. తాజా పరిణామాల నేపథ్యంలో సురేఖ హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం నుంచి వచ్చిన అత్యవసర పిలుపు మేరకు ఆమె హస్తిన బాట పట్టారు. ఈ పర్యటనలో భాగంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు కూడా ఆమె అపాయింట్‌మెంట్ కోరారు. ఇటీవల వరంగల్ జిల్లా గీసుకొండలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే విమర్శలు గుప్పించడాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ... ఆ వ్యాఖ్యలపై తక్షణమే వివరణ ఇవ్వాలంటూ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె ఇప్పటికే తన వివరణను సమర్పించారు. కొండా సురేఖ ఇచ్చిన వివరణతో పాటు, వనపర్తి వ్యవహారంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన సమగ్ర నివేదికను టీపీసీసీ నేరుగా అధిష్ఠానానికి పంపించింది. అధిష్ఠానం వద్దకు నివేదికలు చేరిన వెంటనే కొండా సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపు రావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. క్రమశిక్షణ ఉల్లంఘన అంశంలో కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి సురేఖ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## పాకిస్థాన్ లో 100 ఏళ్ల చరిత్ర ఉన్న హిందూ దేవాలయం కూల్చివేత

పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో శతాబ్ద కాలం నాటి చరిత్ర కలిగిన ఒక హిందూ దేవాలయాన్ని కూల్చివేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. నరోవల్ నగరం పరిధిలోని సిరాజ్ గ్రామంలో ఆగస్టు 21న ఈ సంఘటన చోటుచేసుకుంది. సమీపంలోని ఒక ఇస్లామిక్ సెమినరీ (మదర్సా) విస్తరణ కోసమే ఈ ఆలయాన్ని ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారని మైనారిటీ హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. పాకిస్థాన్ మసీహా మిల్లత్ పార్టీ (పీఎంఎంపీ) ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకువచ్చింది. కొందరు వ్యక్తుల పథకం ప్రకారం ఈ ఆలయ నిర్మాణాన్ని కూల్చివేశారని ఆ పార్టీ ఛైర్మన్ అస్లాం పర్వేజ్ సహోత్రా ఆరోపించారు. గతంలో ఆలయం సమీపంలోని భూమిని ఎవాక్యూ ట్రస్ట్ ప్రాపర్టీ బోర్డ్ (ఈటీపీబీ) సదరు మదర్సాకు లీజుకు ఇచ్చింది. అయితే, అద్దె చెల్లించకపోవడంతో ఆ లీజును రద్దు చేశారు. అయినప్పటికీ, ఆలయ స్థలంలోని కొంత భాగాన్ని కొందరు ఆక్రమించుకున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరిలోనే ఆక్రమణదారులను ఖాళీ చేయించి, సదరు ఆస్తిని సీల్ చేయాలని ఈటీపీబీ డిప్యూటీ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అవి అమలు కాలేదని పీఎంఎంపీ విమర్శించింది. ఈ ఘటనపై ఆగస్టు 28న



స్థానికులతో కలిసి పంజాబ్ అదనపు హోమ్ సెక్రటరీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆలయ కూల్చివేతకు బాధ్యులైన వారిపై, విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ధ్వంసం చేసిన ఆలయాన్ని తిరిగి పునర్నిర్మించాలని, దేశంలోని దేవాలయాలు, గురుద్వారాలు, చర్చిలకు సరైన రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

### తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట

### కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్

## పథకాలపై స్టే ఎత్తివేసిన హైకోర్టు

**- తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు- సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన ధర్మాసనం-ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో జోక్యంపై కీలక వాదనలు-పథకాల అమలుకు తొలగిన అడ్డంకులు**

**హైదరాబాద్,సెప్టెంబర్,01:**తెలంగాణలో అమలవుతున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ పథకాల అమలును నిలిపివేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వులను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం రద్దు చేసింది. దీంతో ఈ పథకాల కొనసాగిం పునకు మార్గం సుగమమైంది. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు సంబంధించి 2014 నుంచి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాలు చేస్తూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడంతో, విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి పథకాల అమలుపై మధ్యంతర స్టే విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ, ఈ పథకాలు 2014 నుంచి నిరంతరాయంగా అమలవుతున్నాయని, పిటిషనర్ లబ్ధిదారుడు కానందున ఆయనకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని కోర్టుకు తెలిపారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని, ప్రభుత్వ విధానపరమైన



నిర్ణయాలపై దాఖలైన ఇలాంటి వ్యాజ్యాలను డివిజన్ బెంచ్ మాత్రమే విచారించాలని వాదించారు. షాదీ ముబారక్ వంటి పథకాలకు సుప్రీంకోర్టు కూడా గతంలో అనుమతినిచ్చిందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అడ్వకేట్ జనరల్ వాదనలతో ఏకీభవించిన డివిజన్ బెంచ్, సింగిల్ జడ్జి ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేస్తూ తీర్పునిచ్చింది. హైకోర్టు తాజా నిర్ణయంతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలు రాష్ట్రవ్యాప్తంగా యథావిధిగా కొనసాగనుంది.

## 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్‌కు బిగ్ రిలీఫ్.. సింగిల్ బెంచ్ ఆర్డర్‌పై డివిజన్ బెంచ్ స్టే!

**హైదరాబాద్,సెప్టెంబర్,01:**హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్‌ఏజెన్సీ కమిషనర్ రంగనాథ్ కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనను కమిషనర్ బాధ్యతల నుంచి వెంటనే తప్పించాలంటూ గతంలో సింగిల్ బెంచ్ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. గతంలో విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్, 'హైడ్రా' ప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుంటూ ఆస్థానంలో డీజీహోదా కలిగిన ఉన్నతాధికారిని నియమించాలని భావించింది. అందులో భాగంగానే రంగనాథ్‌ను వెంటనే ఆ పదవి నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కీలక ఉత్తర్వులు ఇచ్చింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పును తీవ్రంగా పరిగణించిన కమిషనర్ ఏవీ రంగనాథ్, ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ వెంటనే హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. తన నియామకం, సింగిల్ బెంచ్ ఆదేశాల్లోని అంశాలపై పిటిషన్ దాఖలు చేశారు.

ఈ మేరకు తాజాగా ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం, ఇరుపక్షాల వాదనలను పరిశీలించింది. అనంతరం సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ నిర్ణయంతో ఏవీ రంగనాథ్





హైడ్రా కమిషనర్‌గా తన బాధ్యతల్లో కొనసాగడానికి చట్టపరంగా మార్గం సుగమమైంది. ఈ పిటిషన్‌పై పూర్తిస్థాయి వాదనలు వినేందుకు గానూ తదుపరి విచారణను ధర్మాసనంనవంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన ఈ స్టే ఉత్తర్వులతో హైడ్రానేతృత్వంలో నగరంలో జరుగుతున్న చెరువుల సంరక్షణ, ఆక్రమణల తొలగింపు చర్యలు యథావిధిగా కొనసాగనున్నాయి.

## నీటిని ఆయుధంగా వాడొద్దు..

### ఎస్‌సీఓ వేదికపై పాక్ ప్రధాని షెహబాజ్ వ్యాఖ్యలు..

: భారత్–పాకిస్థాన్ మధ్య సింధు జలాల వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. సింధు జలాల ఒప్పందం పై హేగ్‌లోని కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఇచ్చిన తీర్పును భారత్ తిరస్కరించిన సంగతి తెలిసిందే. తాజాగా పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ అంశాన్ని షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రస్తావించారు. నీటిని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని ఆయన అన్నారు ఎస్‌సీఓ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్ సమావేశంలో మాట్లాడిన షెహబాజ్ షరీఫ్.. నీరు లక్షలాది మంది జీవితాలకు ఆధారమని, వ్యవసాయానికి కీలకమని, భవిష్యత్ తరాల అవసరాలను తీర్చే వనరని అన్నారు. నీటిని ఆయుధంగా ఉపయోగించడానికి అనుమతించకూడదని షరీఫ్ వ్యాఖ్యానించారు. ఉమ్మడి జల వనరులను ఒక దేశంపై ఒత్తిడి తీసుకురావడానికి లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించకూడదని పేర్కొన్నారు షెహబాజ్ షరీఫ్ జల వివాదాన్ని ప్రస్తావించడానికి కొద్దిసేపటి ముందు ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఎస్‌సీఓ సదస్సులో ప్రసంగించారు ఆయన ప్రసంగంలో ఉగ్రవాదంపై



ప్రధానంగా దృష్టి పెట్టారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో డబుల్ స్టాండర్డ్స్ ఉండకూడదని మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి నిధులు అందించడం, ఉగ్రవాదుల నియామకం, ఉగ్ర స్థావరాలు వంటి మొత్తం వ్యవస్థను నిర్మూలించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉగ్రవాదాన్ని తమ సాధనంగా ఉపయోగించే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని కూడా ప్రధాని పేర్కొన్నారు.

## మళ్లీ పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర..!



**న్యూఢిల్లీ,సెప్టెంబర్,01:** ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ సిలిండర్ల ధరలను మరోసారి పెంచాయి. తాజా వివరాల ప్రకారం.. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను సవరించాయి. , క్యాంటీన్లు, ఇతర వాణిజ్య సంస్థలకు అదనపు ఖర్చు తప్పడం లేదు. ఇది సాధారణ వినియోగదారులకు కొంత ఊరట కలిగించే అంశంగా చెప్పవచ్చు. ఇండియన్ ఆయిల్ విడుదల చేసిన తాజా ధరల ప్రకారం హైదరాబాద్‌లో 19కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.11పెరిగి రూ.2,996 కు చేరుకుంది. ఢిల్లీలో రూ.9.50 పెరిగి రూ.2,747.50కు చేరగా, ముంబైలో రూ.2,691.50 నుంచి రూ.2,701కు పెరిగింది.

## కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిది

# కొత్త నీరు ఎంత వచ్చినా నిలకడగానే ఉంటుంది

- రాహుల్ గాంధీని ప్రధాని చేయాలంటే గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి- క్రమశిక్షణతో ప్రజల కోసం, పార్టీ కోసం పని చేసే వారినే పార్టీ ప్రోత్సహిస్తుంది-స్వంత పార్టీపైనే విమర్శలు చేసే వారు ఉన్నా ఒకటే... పోయినా ఒకటే-కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీనే పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నాయకులను ఆహ్వానిస్తోంది-నేనే గొప్ప, నేను సీనియర్ అనే అహంభావాలను పక్కన పెట్టండి- రాహుల్ గాంధీని ప్రధాని చేయాలంటే అందరిని కలుపుకొని పోవాలి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలి- 2029ఎన్నికలలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురావేయడమే ఏకైక లక్ష్యం-సర్పంచులు, మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు అందరిని కలుపుకొని పోవాలి-మారుతున్న రాజకీయాలకు అనుగుణంగా మనం కూడా మారాలి- పార్టీలో ఉంటూ తప్పు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు- కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విపరీతమైన దాడి జరుగుతుంది- సోషల్ మీడియాలో జరిగే తప్పుడు ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలి- కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు కొంచెం అయినా తెలంగాణ పౌరుషం ఉంటే కవిత చేసే ఆరోపణలకు సమాధానం చెప్పాలి- లక్షల కోట్ల అవినీతికి పాల్పడి వాళ్ళు ఈ రోజు సిగ్గులేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన చేస్తాం అంటున్నారు

**రాహుల్ గాంధీని ప్రధాని చేయాలంటే గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి.... క్రమశిక్షణతో ప్రజల కోసం, పార్టీ కోసం పని చేసే వారినే పార్టీ ప్రోత్సహిస్తుంది.... స్వంత పార్టీపైనే విమర్శలు చేసే వారు ఉన్నా ఒకటే... పోయినా ఒకటే.... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీనే పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నాయకులను ఆహ్వానిస్తోంది.... నేనే గొప్ప, నేను సీనియర్ అనే అహంభావాలను పక్కన పెట్టండి..... రాహుల్ గాంధీని ప్రధాని చేయాలంటే అందరిని కలుపుకొని పోవాలి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలి.... 2029ఎన్నికలలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురావేయడమే ఏకైక లక్ష్యం.... సర్పంచులు, మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు అందరిని కలుపుకొని పోవాలి.... మారుతున్న రాజకీయాలకు అనుగుణంగా మనం కూడా మారాలి..... పార్టీలో ఉంటూ తప్పు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు..... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విపరీతమైన దాడి జరుగుతుంది.... సోషల్ మీడియాలో జరిగే తప్పుడు ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలి.... కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు కొంచెం అయినా తెలంగాణ పౌరుషం ఉంటే కవిత చేసే ఆరోపణలకు సమాధానం చెప్పాలి.... లక్షల కోట్ల అవినీతికి పాల్పడి వాళ్ళు ఈ రోజు సిగ్గులేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పై నిరసన చేస్తాం అంటున్నారు....**

జనగామ/జఫర్ గడ్ సెప్టెంబర్ 1 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి అధికారంలో ఉన్నప్పుడు అక్రమంగా సంపాదించిన డబ్బు ఇంకా లెక్కపెడుతున్నారని కల్వకుంట్ల కవిత ఆరోపిస్తుందని కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులకు సిగ్గు ఉంటే, తెలంగాణ పౌరుషం ఉంటే కవిత ఆరోపణలకు సమాధానం చెప్పి నిరసనలు చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. జఫర్ గడ్ మండలం తిమ్మంపేట లోని రేణుక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన జఫర్ గడ్ మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం మరియు మండల విస్తృత స్థాయి సమావేశానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వ 1000రోజుల పాలనపై బిఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసనలు చేపట్టే ముందు బిఆర్ఎస్ పై కల్వకుంట్ల కవిత తీవ్రమైన ఆరోపణలు చేస్తుందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అక్రమంగా సంపాదించిన డబ్బు ఇంకా లెక్కపెడుతున్నారని, కాళేశ్వరం కుంగిపోవడానికి హరిష్ రావు అవినీతే కారణం అని ఆరోపిస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో లక్షల కోట్ల అవినీతికి పాల్పడి ఫామ్ హౌస్ లు, ప్యాలెస్ లు కట్టుకున్నారని ఆరోపించారు. ఇవాళ అధికారం కోల్పోయామనే అక్కసుతో వాళ్ళ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎందుకు నిరసనలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదల స్వంత ఇంటి కళను చేసినందుకా....? సన్న బియ్యంతో పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెడుతున్నందుకా....? వ్యవసాయంతో పాటు ఇంటికి 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నందుకా....? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నందుకా.... కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు ఇస్తున్నందుకా.....? ఋణ మాఫీ, రైతు భరోసా, సన్నాలకు బోనస్ ఇస్తున్నందుకా....? దేనికి నిరసనలు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కలరాసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. మన హక్కులను కాపాడుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి, రాహుల్ గాంధీ ప్రధాని కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కాపాడబడుతాయని వెల్లడించారు. అందుకోసం ఈ రోజు నుండే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాలంటే గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. పార్టీలో కొత్త పాత అనే విభేదాలు పక్కన పెట్టి అందరూ ఒకే కుటుంబ సభ్యులుగా కలిసి పని చేద్దామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని అందులోకి కొత్త నీరు వస్తూనే ఉంటుంది పాత నీరు పోతూనే ఉంటుందని ఏదేమైనా సముద్రం నిలకడగానే ఉంటుందని తెలిపారు. కొత్తగా ఎంపికైన మండల గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు అందరిని కలుపుకొని పోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి కావాల్సింది క్రమశిక్షణతో ప్రజలకోసం, పార్టీ కోసం పని చేసే వారు కలవాలని స్పష్టం చేశారు. కేంద్రంలో




అధికారంలో ఉన్న బీజేపీ కూడా పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నాయకులను ఆహ్వానిస్తుందని, గౌరవిస్తుందని అన్నారు. అలాంటిది అధికారంలోకి రావాలనుకుంటున్న మనం కూడా ప్రజలలో పట్టున్న వారిని, పార్టీ కోసం పని చేసే వారిని ఆహ్వానించాలని తెలిపారు. నేనే గొప్ప నేనే సీనియర్ అనే అహంభావాన్ని పక్కన పెట్టాలని చెప్పారు. 2029 ఎన్నికలలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురావేయడమే లక్ష్యంగా పని చేస్తున్నానని తెలిపారు. అందుకు కట్టుబడి ప్రతి నిత్యం కృషి చేస్తున్నాని అదే విధంగా ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని సూచించారు. అలా పని చేసినప్పుడే రాష్ట్రంలో రేవంత్ రెడ్డి గారు రెండవ సారి ముఖ్యమంత్రి అవుతారని కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి వస్తుందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై, పార్టీపై ప్రతిపక్షాలు చేసే విమర్శలను గట్టిగా తిప్పోకొట్టాలని అన్నారు. జఫర్ గడ్ మండలంలో ప్రతీ గ్రామంలో కోటి రూపాయల నుండి 5కోట్ల వరకు అభివృద్ధి పనులు చేశామని అన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలోని ఏ గ్రామంలో ఎం జరుగుతుందో, ఎవెరెవరు ఎం చేస్తున్నారో ప్రతీ విషయం నాకు తెలుసని కానీ కొన్ని చూసి చూడనట్లు, విని విననట్లు ఉంటానని అంతే తప్పించి నాకు తెలియదు అని మాత్రం అనుకోవద్దని హెచ్చరించారు. పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బూతుకు 10చొప్పున ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను సెప్టెంబర్ 15లోగ లాగే గ్రామానికి 10 నుండి 25లక్షల వరకు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి అందజేయాలని సూచించారు. వచ్చే రోజులలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడమే ఏకైక ఎజెండగా అందరం కలిసికట్టుగా పని చేద్దామని మరోసారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు నూకల ఐలయ్య, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శులు అన్నబోయిన బిక్షపతి, ఇల్లందుల బేబీ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, నూతనంగా ఎంపికైన గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇంచార్జ్ లు, బీఎల్ఏలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 1 (డీకే చాటింపు) : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 159 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, ఏసీపీ శ్రీశైలంలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో 34 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ శ్రీ పి.సాయి చైతన్య, ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించా ల్సిందిగా సంబందిత అధికారులకుపలు సూచనలు చేయడమైనది. ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం




సంబంధిత పోలీస్ స్టేషన్ ల యొక్క ఎస్.ఐ మరియు సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలులేకుండాస్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియ గించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని 34 ఫిర్యాదులు వచ్చాయని అన్నారు .

## సాయి లక్ష్మీ హాస్పిటల్లో అందుబాటులోకి

# చిన్న పిల్లల వైద్య సేవలు

### ప్రోపరేటర్ సంపత్ కుమార్ వెల్లడి

డీకే.చాటింపు హనుమకొండ హన్మకొండ నిరూప్ నగర్ మెయిన్ రోడ్డులో నిర్వాహకులు అర్. ఎం.పి. సంపత్ కుమార్ ఏర్పాటు చేసిన సాయి లక్ష్మీ హాస్పిటల్లో మంగళవారం నుండి చిన్న పిల్లల వైద్యులు డాక్టర్ రాముచే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకుని వచ్చినట్లు నిర్వాహకులు సంపత్ కుమార్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎండి. ఫిజిషియన్ జనార్ధన్ మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను 24 గంటల పాటు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటల నిరంతర వైద్య సేవల కోసం డాక్టర్ ఎం. జనార్ధన్, ఎండీ ఫిజీషియన్, డాక్టర్ ఎండీ పీడియాట్రిషియన్ రాము, డాక్టర్ ఎన్. సింధు, ఎంఎస్ గైనకాలజిస్ట్ మరియు స్త్రీ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే ఆసుపత్రిలో ఆధునిక వైద్య సదుపాయాలతో స్కానింగ్, ఎక్సరే ల్యాబ్, మెడికల్ షాప్ తదితర సేవలు అందుబాటులో




ఉన్నాయని నిర్వాహకులు సంపత్ కుమార్ మీడియా కు వెల్లడించారు. చుట్టూ పక్కల ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని వేళలా సాయి లక్ష్మీ హాస్పిటల్లో వైద్య సేవలు అందించేందుకు కృషి చేసినట్లు తెలిపారు.

# భీమా రంగంలో ఎల్ఐసికి 70 ఏళ్లు

**-ఎల్ఐసిలో బీమా చేయండి.. -ధీమాగా జీవించండి... -నారాయణపేట బ్రాంచి మేనేజర్ కృష్ణారెడ్డి... -నారాయణపేట బ్రాంచిలో జ్యోతి ప్రజ్వలన తదితర కార్యక్రమాలు...**

నారాయణపేట,(డీకే చాటింపు): భారతదేశంలోనే లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బీమా సంస్థకు ప్రత్యేక 70 ఏళ్ల ఘన చరిత్ర ఉందని ఎల్ఐసి నారాయణపేట బ్రాంచి మేనేజర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎల్ఐసి 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నారాయణపేట బ్రాంచిలో జ్యోతి ప్రజ్వలన తదితర కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత భీమా రంగం అంటే ముందుగా గుర్తుకు వచ్చే పేరు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసి)కోట్లాది మంది భారతీయుల జీవితాలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థగా పేరుగాంచినఎల్ఐసి ఏర్పాటై నేటితో 70 ఏళ్ళు పూర్తయినట్లు తెలిపారు. ఏడు దశాబ్దాలుగా భారతీయులకు ఆర్థిక భద్రత ప్రతికగా నిలుస్తున్న ఎల్ఐసి బీమా సేవలతో పాటు దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ జీవిత బీమా తీసుకోవాలని ఆయన కోరారు. సీనియర్ ఏజెంట్స్ మండికి ఆనంద్,రఘునాథ్ రావు, వెంకటయ్య, రాం చందర్, నర్సప్ప,బిమషప్ప,డివో రాకేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఐఅండ్ పీఆర్ జేడీ జగన్‌కు పదోన్నతి

### టీడబ్ల్యూజేఎఫ్ నేతల అభినందనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 1( డీకే చాటింపు) రాష్ట్ర సమాచార, పౌరసం బంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ గా పదోన్నతి పొందిన జాయింట్ డైరెక్టర్ డి ఎస్. జగన్ కు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అభినందనలు తెలిపారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులతో కలిసి మాసబ్ ట్యాంక్ లోని సమాచార భవన్ (ఐఅండ్ పీఆర్ కార్యాలయం) లో జగన్ ను కలిసి పూలబోకే అందజేసారు. సోమయ్య తో పాటు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్, యర్రమిల్లి రామారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.పాండురంగారావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, రంగారెడ్డి జిల్లా నాయకులు నంబి పర్వతాలు, గోవింద్ నాయక్, ఎం. రవికుమార్ తదితరులు నూతన అడిషనల్ డైరెక్టర్ జగన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సమాచార శాఖలో



వివిధ హోదాల్లో పనిచేసిన డిఎస్ జగన్ కు డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి లభించడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఈ సందర్భంగా జగన్ దృష్టికి తీసుకువెళ్ళి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

# పుష్పగిరికి అమెరికన్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్

హైదరాబాద్ , సెప్టెంబర్ 1, డీకే చాటింపు:- పుష్పగిరి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (పీఆర్డీస్) వ్యవస్థాపకురాలు పుష్పలీల సేవలను గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ పాండిచ్చేరి వేదికగా శనివారం ఏర్పాటు చేసిన కాన్వకేషన్ లో యూనివర్సిటీ ప్రతినిధుల చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ పట్టాను అందజేయడం జరిగిందనీ పుష్పలీల ఒక ప్రకటన లో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త యాదగిరి ప్రోత్సాహం, సమన్వయంతో తమ సంస్థ ఆధ్వర్యంలో సమాజ హితం కోసం అనేక కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. తమ సేవలను గుర్తించిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ తమకు గౌరవ డాక్టరేట్ ను అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ యూనివర్సిటీ నిర్వాహకులకు అదేవిధంగా తమను నామినేట్ చేసిన షార్డ్ ఎన్జీఓ గౌని నరసింహ గౌడ్ కు హృదయపూర్వక ధన్యవాదములు కృతజ్ఞతాభివందనాలు తెలిజేశారు.



డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
బుధవారం, సెప్టెంబర్,2, 2026

# తోలుబొమ్మలాట కనుమరుగేనా..?

సినిమాలు, టి.వి.లు లేని రోజుల్లో వృత్తి కళాకారుల ప్రదర్శనలకు ప్రజలు బ్రహ్మరథం పట్టేవారు. అలిసిపోయిన పల్లె ప్రజలకు జానపదుల ప్రదర్శనలు సేదతీర్చేవి. గ్రామాల్లో జానపద కళాకారులు వివిధ రకాలైన ప్రదర్శనలు ఇచ్చేవారు. ముందు తరాలవి శ్రమైక జీవన విధానం. కష్టజీవులే ఎక్కువ మంది. రోజంతా కాయకష్టం చేసి ఇళ్లకు చేరిన వారి అలసట తీర్చి వారికి సాంత్వన చేకూర్చే కళా రూపాలే జనపదాలు. అలాంటి వాటిలో తోలు బొమ్మలాట ప్రధానమైనది. తోలు బొమ్మలాట ఒక జానపద కళారూపం. తాను స్వయంగా అనుకరించలేని జానపదుడు కావ్యాల్లోనూ, పురాణాల్లోను వర్ణింపబడిన పాత్రల ఆహార్య విశేషాలను స్వయంగా సృష్టించు కున్నాడు. తన భాషతో ఆ మూగ చిత్రాలకు ప్రాణం పోశాడు. రకరకాల విన్యాసాలను వాటి చేత చేయించాడు. తాను స్వయంగా వెనుకనుండి ఈ పాత్రలను కదిలించాడు. కదులుతున్న ఆ జీవంలేని బొమ్మలతో జీవ నిబద్ధమైన ఒక దృశ్యాన్ని ప్రదర్శించడం లోనే జానపదుడి కళాత్మకత దాగి ఉంది. సుసంపన్న మైన హిందూ ఇతిహాసాలను తెర మీదకి తెచ్చిన ఒక గొప్ప ప్రక్రియ తోలు బొమ్మలాట.ఒక సామూహిక సంగీత, నాట్య ప్రదర్శన కళారూపమైన తోలు బొమ్మలాట, జానపదుని మొదటి రంగస్థల ప్రదర్శన కళారూపాన్ని గుర్తించవచ్చు. పూర్వం రాజాస్థానాల లోని పండితులు తమ ప్రభువులను సంతోష పెట్టడానికి బొమ్మలను తయారు చేసి మానవులుగా నటింపచేస్తే సృజనాత్మకంగా ఉంటుందని భావించి తోలు బొమ్మలను తయారుచేసి, తెల్లటి పంచెను తెరగా అమర్చి, దానిపైన దీపం కాంతిలో బొమ్మల నీడలను పడేటట్లు చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. ఈ విధంగా తోలు బొమ్మలాట పుట్టిందని, ఈ ఆట పండితుల చేత మెరుగులు దిద్దుకున్నదని, చెప్పడానికి అమర కోశం లోని శ్లోకాలను నిదర్శనంగా పేర్కొనవచ్చు. మహా భారతంలో తోలు బొమ్మలాట ప్రస్తావన ఉంది. భగవద్గీతలో సత్త్వ, తమో, రజో గుణాలు మూడు దారాలని, అవి పరమాత్ముని చేత మానవ జీవన గమనంలో లాగబడు తుంటాయని చెప్పబడింది. మానవుడు బొమ్మ అయితే అతనికున్న సూత్రాలు ఈ మూడు గుణాలు. ఆడించేవాడు జగన్నాటక సూత్రధారి అన్న అర్థంలో ఉన్న ఈ భాగం తోలు బొమ్మలాటలకు సంబంధించిన ప్రస్తావన. భారతీయ జానపద ప్రదర్శన కళల్లో అతి ప్రాచీనమైన దృశ్య రూపకానికి చెందినది తోలు బొమ్మలాట. క్రీ.పూ 3 వ శతాబ్దం నాటికే తెలుగు దేశంలో తోలు బొమ్మలాట ప్రచారంలో ఉన్నట్లు తెలుస్తోంది. చరిత్రకారుల ప్రకారం తోలు బొమ్మలు క్రీ.పూ 2500 సం.నకు పూర్వం, పురాతన నాగరికత అయిన హరప్పా, మొహంజోదారో కొన్ని వేల కిలోమీటర్ల వరకూ వ్యాపించినట్లు చెపుతారు. క్రీ.పూ 3 వ శతాబ్దానికి చెందిన అశోకుని శిలా శాసనాల్లో జంబూ ద్వీపానికి బొమ్మలాట ప్రదర్శన రంగంగా ఆపాదించారు. పతంజలి మహాభాష్యంలో తన కాలపు వినోద సాధనాలను వివరిస్తూ మూడు ప్రధానమైన వాహికలను వివరిస్తూ వాటిలో బొమ్మలాట ఒక ప్రధనమైన వాహిక అని వివరించారు. తేరి గాథ అను బౌద్ధ గ్రంథంలో బొమ్మలాటకు సంబంధించిన ప్రస్తావన ఉంది. వాత్సాయనుని కామసూత్రాల్లో బొమ్మలలోని రకాలు, బొమ్మలాటల్లోని తేడాలు చర్చింపబడినాయి. కన్యలను ఆకర్షించడానికి బొమ్మలాటల ప్రదర్శన అవసరమని వాత్సాయనుని వివరణ. నాటకానికి, తరువాత పరోక్షంగా తోలుబొమ్మలాట సినిమాకు మూలమైంది. కదలికలోని ఆనందం కనుక్కున్న మనిషి ఆలోచనలో నుండి పుట్టిందే బొమ్మలాట. స్థిరత్వం నుండి చలనం వైపుకు పయనించడంలో భాగంగా ప్రాచీన మానవుడు బొమ్మలాటను సృష్టించు కున్నాడు. కథ చెప్పడం మొదలైన తరువాత ఆ కథలోని పాత్రలు తెరమీద కనిపిస్తే, నటిస్తే చూడాలన్న జనపదుడి తపనలో నుండి బొమ్మలాట పుట్టింది. బొమ్మలతో ఆడుకోవడం అతి ప్రాచీన కళ. కొయ్యబొమ్మ లాటలు, కట్టెబొమ్మ లాటలు, తొడుగు బొమ్మలాటలు, తళ్ళబొమ్మ లాటలు, బుట్టబొమ్మ లాటలు, తోలుబొమ్మ లాటలు అని బొమ్మలాటలు అనేకము ఉన్నాయి. రంగస్థలంపై పొడవాటి గుంజలపై తెల్లటి వస్త్రాన్ని లేదా పంచెను ముందు భాగంలో గట్టిగా లాగి కడతారు. తెర భూమి నుండి నిలువుగా ఉండకుండా కొంచెం ఏటవాలుగా కడతారు. ఈ విధంగా కట్టడం వల్ల బొమ్మలను ఆడించే టప్పుడు బొమ్మలకు కాళ్ళు అడ్డు తగలకుండా ఉంటుంది. తోలు బొమ్మల ప్రతిబింబాలు సరిగ్గా తెరపై పడడానికి తెరలోపలి నుండి పూర్వం కాగడాలు ఉపయోగించేవారు.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి :
సెల్ : 9603754136 - 7386287837

## ఎమ్మెల్యే సార్ గోపనపల్లి

# బైపాస్ రోడ్డు బాగు చేయించండి

నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 31(డీకే చాటింపు): నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని అతిపెద్ద గ్రామం, కాలనీ అయిన గుపనపల్లి గంగస్థాన్ ఫేస్ త్రీ రోడ్ నుండి బైపాస్కుచేరుకునే లింక్ రోడ్డు అధ్వానంగా ఉండి రాకపోక లకు ఇబ్బంది కలుగుతుందని ఇట్టి రోడ్డునువెంటనే మంజూరుచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ లింకు రోడ్డు గత కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా 33 ఫీట్ల రోడ్డు మంజూరు చేశారని కాగా ప్రస్తుతం పనులు ఆపేసి అర్ధాంతరంగా నిలిపివేశారని గంగస్థాన్ గుపన్ పల్లి బైపాస్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలనీ నుండి బైపాస్ వరకు సుమారు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని అంతే కాకుండా ఎమ్మెల్యేగారిక్యాంప్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ రోడ్డు ఉందని ప్రజలు కలవడానికి రావాలన్న ఈ దారి ఎంతో దగ్గరవుతుందని కాబట్టి ఈ రోడ్డుపై దృష్టి సారించి నగర పాలక సంస్థ ద్వారా పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు. నగర పాలక సంస్థకు మరియు రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయ వనరుగా ఉన్న ఈ ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేకపోవడం శోచనీయ మని ,ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకుడు ప్రముఖ వ్యాపారవేత్త నరేందర్ రెడ్డి, చిటికెలనారాయణరెడ్డి లు స్పందించి రోడ్డు మంజూరు చేయించి పూర్తి చేయించాలని కాలనీవాసులైన శ్రీధర్ స్వామి, ధనుంజయ రెడ్డి, నర్సారెడ్డి, చిన్నా రెడ్డి తదితరులు విజ్ఞప్తి చేశారు. కంటేశ్వర్ బైపాస్ నుండి మాధవ నగర్ రైల్వే బ్రిడ్జి వరకు ఉన్న ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా అనేక కుటుంబాలు నివాస ముంటున్నారు.



ప్రధానంగా ఈ ప్రాంతంలో శతమానం, సిఎన్ఆర్ హోమ్స్, కేఎన్ఆర్ హోమ్స్ ,అటల్ ప్రాజెక్ట్ లలో దాదాపు 500 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అంతేకాకుండా ప్రధానంగా చైతన్య టెక్నో స్కూల్ షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాల్ లు ఉండడంతో ఈ ప్రాంతం రద్దీ ఏర్పడింది. ఈ రహదారి గుండా ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని నగర శివారులో ఉండడం వల్ల ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టిసి రిక్వెస్ట్ బస్ స్టాప్ నేషనల్ మార్ట్ సమీపంలో ఏర్పాటు చేయాలని కాలనీవాసులు చంద్రకాంత్ రెడ్డి ,శ్రీధర్ స్వామి, ధనుంజయ రెడ్డి, సత్యనారాయణ,చిన్నారెడ్డి, నర్సారెడ్డి ,కిరణ్ ,గణేష్ తదితరులు రూరల్ ఎమ్మెల్యే మరియు రీజినల్ మేనేజర్ కు విజ్ఞప్తి చేశారు.

## సెంట్రల్ జైలు భద్రతపర్వాట్లపై

# క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమీషనర్





నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 1 (డీకే చాటింపు): నిజామాబాద్ కేంద్ర కారాగారంలో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయడం,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో భాగంగా నిర్వహించిన సెక్యూరిటీ రివ్యూ మీటింగ్లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పాల్గొని కేంద్ర కారాగారంలోని భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర కారాగారంలో ప్రస్తుతం అమలులో ఉన్న భద్రతా విధానాలు , బందోబస్తు నిర్వహణ , సిబ్బంది విధుల కేటాయింపు ,ప్రవేశ--నిష్క్రమణ మార్గాలు తదితర అంశాలపైఅధికారులనుఅడిగి వివరాలుతెలుసుకున్నారు.

జైలు భద్రత విషయంలో ప్రతి అధికారిసిబ్బందిఅప్రమత్తంగా వ్యవహరించాలని , విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నిబంధనల ప్రకారం విధులునిర్వహించాలని సూచించారు.

సీసీ కెమెరాల పనితీరుపై పరిశీలన

కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వ్యవస్థను పోలీస్ కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. జైలు పరిసర ప్రాంతాలు , ప్రధాన ప్రవేశ ద్వారాలు , కీలక ప్రదేశాలు నిరంతరం కెమెరాల నిఘాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా వాటి నిర్వహణ , రికార్డింగ్ వ్యవస్థ , పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

ప్రహరీ గోడ, బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

కేంద్ర కారాగారం చుట్టూ ఉన్న ప్రహరీ గోడ భద్రతను కూడా కమిషనర్ పరిశీలించారు. ప్రహరీ గోడ వద్ద ఎలాంటి భద్రతా లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. జైలు వద్ద విధులు నిర్వహిస్తున్న బందోబస్తు సిబ్బంది అప్రమత్తత , విధుల నిర్వహణ , పహారా విధానాలను సమీక్షించారు.

హాస్పిటల్, డీ–అడిక్షన్ సెంటర్ పరిశీలన

కేంద్ర కారాగారంహాస్పిటల్లో డీ–అడిక్షన్ సెంటర్లను కూడా పోలీస్ కమిషనర్ సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న వైద్య సేవలు , భద్రతా ఏర్పాట్లు , సిబ్బంది పర్యవేక్షణ తదితరఅంశాలపై వివరాలుతెలుసుకున్నారు. డీ–అడిక్షన్ సెంటర్ లో చికిత్స పొందుతున్న వారికి భద్రతతో పాటు అవసరమైన సేవలు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అప్రమత్తతేప్రధానలక్ష్యం

కేంద్ర కారాగారం అత్యంత కీలకమైన భద్రతా ప్రదేశమని , అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు. భద్రతా ప్రమాణాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ , గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దు కోవాలని తెలిపారు. జైలు అధికారులు , పోలీస్ శాఖ మరియు భద్రతా సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తే భద్రతను మరింత సమర్థ వంతంగా నిర్వహించ వచ్చునిపేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర కారాగారం భద్రత , సీసీ కెమెరాల పర్యవేక్షణ , ప్రహరీ గోడ భద్రత , బందోబస్తు , హాస్పిటల్, డీ–అడిక్షన్ సెంటర్ తదితర అంశాలపై పోలీస్ కమిషనర్ సమగ్రంగా సమీక్షించి, అవసరమైన సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జైల్ సూపర్నెంట్ పి అశోక్ కుమార్ , డిప్యూటీ జైలర్ శ్రీ మన్మధరావు , జైలర్లు శ్రీ తిరుమలరెడ్డి , శ్రీనివాస్ రెడ్డి , రిజర్వ్ ఇన్స్పెక్టర్ (అడ్మిన్) ధరణి కుమార్ , మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్ 6వ టౌన్ ఎస్ఐ కే. సందీప్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# అసిస్టెంట్ సెక్రెటరీ ఏసిడిపిఓ చారి సేవలు అమోఘం

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 1 (డీకే చాటింపు):తెలంగాణ రాష్ట్ర చైల్డ్ రైట్స్ కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీగా గత ఆరు సంవత్సరాలుగా సేవలందిస్తూ బాలల హక్కుల గురించి వాటి అమలు తీరు గురించి క్షేత్రస్థాయిలో రమణాచారి సేవలు అందించారని చైర్మన్ కొత్తకోట సీత దయాకర్ రెడ్డి, కార్యదర్శి, సిబ్బంది కొనియాడారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో గత 40 సంవత్సరాలుగా వివిధ హోదాల్లో సేవలందించి ఏసిడిపివో గా ఆర్మూర్ నుండి పదవీ విరమణ చేస్తున్న రమణాచారి విరామ సమయంలో కూడా కుటుంబంతో గడుపుతూనే బాలల హక్కుల గురించి సహకరించాలని ఈ సందర్భంగా వక్తలు కోరారు.

# ఈనెల 4న మద్దూరుకు సీఎం రాక

**-సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్...**

**-పలు అభివృద్ధి పనుల పరిశీలినకై సీఎం రాక...**

నారాయణపేట,(డీకే చాటింపు): సీఎం ఏ.రేవంత్ రెడ్డి ఈనెల 4 న(శుక్రవారం) నారాయణపేట జిల్లాలోని మద్దూరు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ (ఐఏఎస్) మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ సి. హెచ్. ప్రియాంక,ఎస్పీ డాక్టర్ వినీత్తో కలిసి మద్దూరు పరిసర ప్రాంతాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులు, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా మద్దూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణపు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం చింతల్దిన్నె మార్గంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల,కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల,కళాశాల నిర్మాణ ప్రాంగణంలో భవన నిర్మాణానికి సంబంధించిన మ్యాప్,పనుల టైమ్లైన్తో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి మార్చి నెలలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సీఎం పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక,ఎస్పీ డాక్టర్



వినీత్ పరిశీలించారు. మద్దూరు సమీపంలోని డిగ్రీ కళాశాల భవనం వద్ద ఒక స్థలంతో చింతల్దిన్నె గ్రామ సమీపంలోని మరో స్థలాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన భద్రతా,సాంకేతిక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేయాలని,అవసరమైన అన్ని ఏర్పాట్లను ముం దస్తుగా పూర్తి చేయాలని సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అధికారులను ఆదేశించారు.

# భూ భారతిలో 22ఏ/1సి కింద ఉన్న భూములను తొలగించి న్యాయం చేయండి

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 1 (డీకే చాటింపు): పట్టా భూములు భూ భారతి లో22ఎ/1సీ కింద రిజిస్ట్రేషన్ శాఖలో చేర్చారని వాటిని వెంటనే తొలగించి మాకు న్యాయం చేయాలని ఆబిదా బేగం ,సఫియా బేగం జిల్లా కలెక్టర్ కు కలిసి వినతి పత్రం అందించారు. నిజామాబాద్ జిల్లా బోధన్ రెవిన్యూ డివిజన్ పరిధిలోని చెక్కి తర్ఫా ,దోంయాల్ తర్ఫా, పాండు తర్ఫా లో సర్వే నంబర్లులో 73-75,79, 80,90-92 ఉన్న భూమి 22 ఎకరాలు 22m/1c కింద చూపిస్తున్నారని ఇది మా స్వంత పట్టా భూములు గత 75 సంవత్సరాలుగా మా అనుభవంలోని ఉందని ఆబిదా బేగంఅన్నారు. ఇట్టి భూముల విషయమై హైకోర్టు ద్వారా 22 ఏ /1సి నుండి తొలగించు టకు ఆర్డర్ కూడా ఉందని రిట్ పిటిషన్ నెంబర్ 6894/2025 తేదీ 06/03/2025 ద్వారా 8 వారాల్లో తొలగించాలని అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా ఇంతవరకు అధికారులు తొలగించలేదు. వక్కు బోర్డు కూడా తమ భూములు అని కోర్టును ఆశ్రయించంగా కోర్టు కొట్టి వేసిన ఆర్డర్ నెంబర్ 2132/2020తేదీ06/03/2020 ద్వారామాకు న్యాయం చేసింది. కాగా కోర్టు ఉత్తర్వులు అమలుచేయుట లో రెవిన్యూ శాఖ రిజిస్ట్రేషన్ శాఖ జాప్యం చేస్తూ మాకు మానసిక ప్రశాంతత లేకుండా ఆందోళనకు గురి చేస్తున్నా రనీ కావున మాపై దయ ఉంచి వెంటనే 22 ఏ /1సి తొలగింప చేయించాలని జిల్లా కలెక్టర్ కువిన్నవించారు. బెల్లాల్ తర్ఫా సర్వే నంబర్ 665/1/2/3 లో 5.35 గుంటలు, సర్వే నంబర్ 693 లో2.14 గుంటలు అదేవిధంగా దంత్యల్ తర్ఫా సర్వే నంబర్ 537లో 1.02 గుంటలు భూమి ఉందని పట్టా పాస్ బుక్కులు మరియు అన్ని హక్కులు కలిగి ఉన్నామని మా యందు దయ ఉంచి 22ఏ/1 సి నుండి తొలగింపజేయాలని సఫియా బేగం విన్నవించారు.

# శ్రీ వినాయక ఆర్యవైశ్య సంఘం నూతన ట్రస్టు ఏర్పాటు



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 1 ( డీకే చాటెంపు): నిజామాబాద్ నగరంలోని శ్రీ వినాయక నగర్ ఆర్యవైశ్య సంఘం నూతన ట్రస్టు ఇరుకుల వీరేశం అధ్యక్షతన సందీప్ గార్డెన్ లో ఏర్పాటయింది. ట్రస్ట్ మెంబర్ల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగాకొక్కొండ లక్ష్మీపతి ,కార్యదర్శిగా నంగునూరు భోజరాజు ఉపాధ్యక్షుడిగా కైలాస సంతోష్ ,సహాయ కార్యదర్శిగా డాక్టర్ బొదుకూరి ప్రవీణ్ కుమార్ గుప్తాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇట్టి ట్రస్ట్ రెండు సంవత్సరాలు ఉంటుంది అని తెలిపారు. ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో స్థానిక వినాయక నగర్ ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశం ఉంటుందని అన్నారు.

# ఆర్మూర్ డివిజన్ లో యూరియా కొరకు ఆందోళన



ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 1 (డికె చాటింపు ) ఆర్మూర్ డివిజన్ బాల్కొండలో ఈరోజు రైతులు యూరియా కొరకు ఆందోళన బాట పట్టారు. బాల్కొండ సొసైటీలో యూరియా లభించక అనేక ఇక్కట్లు పడుతున్నామని పంటకి చేతికి వచ్చే సమయంలో ఇలాంటి పరిస్థితి దాపురించడం శోచనీయమని దీనంతటకీ సొసైటీ కార్యదర్శి వేణు కారణమని రైతులు ఆక్రోషం వెలగక్కారు. వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి యూరియా అందించుటలో సహకరించాలని నినదించారు.

## మహిళాసోదరిమనులకు శుభాకాంక్షలు తెలిపిన చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి

ఎల్బీనగర్, సెప్టెంబర్ 1 (డీకే చాటింపు) ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కమల ఆధ్వర్యంలో జయచంద్ర చారిటబుల్ ట్రస్ట్ తరఫున మహిళాసోదరి మనుల అభ్యున్నతికి గత రెండు నెలలుగా ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులు జరుగుతున్న సందర్భంగా కొత్తగా మూడవ,నాలుగవ బ్యాచ్ మొదలైన సందర్భంగా ఈరోజు వారందరిని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ఎల్ బి నగర్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి, సీనియర్ నాయకురాలు శోభారాణి, మహిళా నాయకురాలు రమాదేవి,విజయలక్ష్మి, అర్చన, శివ బిందు తదితరులు పాల్గొనడం జరిగింది.

# పిఆర్టియు రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చలో హైదరాబాద్

ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 1 (డికె చాటింపు )పి ఆర్ టి యు రాష్ట్ర శాఖ పిలుపు మేరకుచలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆర్మూర్ డివిజన్ పరిధిలోని నందిపేట్ మండల ఉపాధ్యాయులు తరలి వెళ్లారు సిపిఎస్ రద్దు చేయాలనీ నందిపేట్ పిఆర్ టియు అధ్యక్షుడు ఐల భూషణ్ డొంకశ్వర్ పిఆర్టియు అధ్యక్షుడు పోచంపల్లి మోహన్ డిమాండ్ చేసారు ఉమ్మడి అందాల సంఘ నాయకులు ధర్నా కు మద్దతుగా హైదరాబాద్ వెళ్లారు జిల్లా కార్యదర్శి జిందం రవి మాట్లాడుతూ రాష్ట్రంలో అమలులో వున్నా సి పి ఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరిం చాలన్నారు



# పాత పెన్షన్ విధాన అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

### -సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ అమలు చేయాలి... -ఎన్నికల మేనిఫెస్టో హామీ నిలబెట్టుకోవాలి... -సెప్టెంబర్1న,పెన్షన్ విద్రోహ దినం... -టిజీ జేఏసీ,తపస్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో మధ్యాహ్న భోజన సమయంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన...



నారాయణపేట,(డీకే చాటింపు): ఉపాధ్యాయ,ఉద్యోగుల పాలిట శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని టిజీ జేఏసీ,తపస్ ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జిలతో మంగళవారం నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరసింహ మాట్లాడుతూ పెన్షన్ లేకుండా టెన్షన్ తో కూడిన జీవితం ఉద్యోగులకు సరికాదన్నారు.సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచడం జరిగిందని తెలిపారు.దానిని నెరవేర్చి ఉద్యోగ,ఉపాధ్యాయుల కల సాకారం చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తపస్ మండల అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, నరసింహులు,నాయకులు భాను ప్రకాష్,విజయ,లక్ష్మణ్, విశ్వనాథ్ రెడ్డి,ప్రతాప్ రఘురామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మన్ పాడ్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో...

ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ,ఉద్యోగులకు ఇచ్చిన పాత పెన్షన్ అమలు హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)నారాయణపేట మండల అధ్యక్షులు రవి కుమార్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్1న,కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ అమలు వ్యతిరేక దినం సందర్భంగా నారాయణపేట మండలం బొమ్మన్ పాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో టీచర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.అంతరం రవి కుమార్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం వల్ల ఉద్యోగుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని,దానివల్ల వృధ్యాపంలో ఉద్యోగులకు ఆర్థిక భద్రత లేకుండా పోయిందని తెలిపారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని,రాష్ట్ర ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఆ హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సీపీస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓపియస్ విధానాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తపస్ మండల ప్రధాన కార్యదర్శి చిన్న నరసింహులు,జిల్లా నాయకులు మానిక్ ప్రభు, జయప్రకాష్ నాయక్,శ్రీకాంత్ ,లింబ్యా నాయక్,విశ్వనాథ్, రాములు,వాల్యా నాయక్, భాస్కర్,కృష్ణా రెడ్డి,శ్రీలత, స్వామి,పాండు,భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేసి పకడ్బందీగా చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





మంచిర్యాల్ ,(డీకే చాటింపు)సెప్టెంబర్ 1,: ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి సందర్శించి భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన భోజనశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. బెల్లంపల్లి మండల కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని చాకేపల్లి గ్రామంలో మండల తహసిల్దార్ కృష్ణ, సర్వే అధికారులు తో కలిసి రీ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టంను తీసుకువచ్చి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరిగిందని , భూ సమస్యల శాశ్వత పరిష్కారంలో భాగంగా రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 11 నాన్ కడస్టల్ గ్రామాలు, 70 కడస్టల్ గ్రామాలు మొత్తంగా 81 గ్రామాలు రీ -సర్వేకు ఎంపిక కావడం జరిగిందని, తెలంగాణ సర్వే ఉ బౌండరీ చట్టం ప్రకారం రీ -సర్వే నిర్వహించడం జరుగుతుందని, చట్టం గురించి అవగాహన కలిగి ఉండి, క్షేత్రస్థాయిలో అమలు చేయాలని తెలిపారు. గ్రామసభల ద్వారా పట్టదారులకు సమాచారం అందించాలని, మొదట గ్రామసభ నిర్వహించి ప్రజలకు సమాచారం అందించి గ్రామ సరిహద్దును నిర్ణయించాలని, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, అటవీ సంబంధిత భూములను సాధారణ సర్వేయర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్, జి.పి.ఓ.ల ఆధ్వర్యంలో గుర్తించాలని తెలిపారు. తదుపరి సర్వే బృందంతో పాటు రెవెన్యూ బృందాలు ఏర్పాటు చేసి సర్వే నిర్వహించడం, సర్వే సమయంలో ఖచ్చితంగా ఫీల్డ్ రిజిస్టర్ నిర్వహించాలని, సంబంధిత జిపిఓలు అందుబాటులో ఉండి వివరాలను రికార్డు చేయడం ద్వారా క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కరణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతి బృందం లక్ష్యానికి అనుగుణంగా కార్యాచరణ రూపొందించుకొని సర్వే పనులను పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల హద్దుల నిర్ధారణకు సంబంధించిన సమాచారం సర్పంచ్ లు, రైతులకు అందించాలని, రీ-సర్వే ప్రక్రియలో ప్రజల సహకారం తీసుకుని పారదర్శకంగా పనులను పూర్తి చేయాలని తెలిపారు. రీ-సర్వేకు సంబంధించి నిర్ణీత ప్రొఫార్మాలో ఫారాలు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం సక్రమంగా పూర్తి చేసి రికార్డులను సిద్ధం చేయాలని సూచించారు. జి.పి.ఓ.లు భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను సక్రమంగా సిద్ధం చేసి, రీ-సర్వేకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. తాండూర్ మండలం మధునాపూర్ గ్రామ శివారులో వరి సాగు చేస్తున్న రైతులతో బెల్లంపల్లి సబ్ కలెక్టర్, మండల తహసిల్దార్ జ్యోత్స్నతో కలిసి మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు మాట్లాడుతూ తమ పొలాలకు సమీపంలో చెరువు ఉందని, అందువల్లనే వరి సాగు చేస్తున్నామని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నోటీసుల ప్రక్రియ నిర్వహణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ జాబితాలో నోటీసులు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రక్రియను వేగవంతం చేసి భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ వివాదాల పరిష్కారం కోసం చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ సమయంలో తహసిల్దార్ కార్యాలయాలలో సీలింగ్ డిక్లరేషన్ను పరిశీలించి, నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. భూభారతి దరఖాస్తులలో భూమి విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి

### బిసి ఎస్సి ఎస్టి -జె ఏ సి & డిఎస్పి సంయుక్త ఆధ్వర్యంలో నందిపేట్ మండల తహసీల్దార్‌కి వినతి పత్రం



ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 1 (డికె చాటింపు ) నేడు(01.09.2026) నందిపేట్ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో దీజ రాజ రా-జీూజ మండల అధ్యక్షులు భూమేష్ గారి ఆధ్వర్యంలో వీ=ూ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది....దీజ రాజ రా-జీూజ ఉ ఋూ మండల అధ్యక్షులు భూమేష్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన దాదాపు 14 వేల కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నది ఈ ఫీజులు చెల్లించలేని దుస్థితి కారణంగా ముఖ్యంగా బీసీ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కళాశాలలో తమ చదువులను కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు బకాయిలు ఆలస్యం కావడం వల్ల విద్యార్థుల చదువులకు తీవ్ర ఆటంకం కలిగి మధ్యలోనే ఆగిపోతున్నాయి కొందరు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు మొత్తంగా ఈ ప్రభావం ఒక కోటి కుటుంబాలపై పడింది ఇంతటి దుర్భర పరిస్థితిని బీసీ ఎస్సీ ఎస్టీ పేద విద్యార్థులు ఎదుర్కొంటున్నారు.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న ఈ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులు ఎటువంటి ఆటంకం లేకుండా తమ విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో దీజ రాజ రా-జీూజ మండల నాయకులు శ్రీకాంత్, అనిల్, మిత్రులు సురేష్ నాయక్, అరవింద్ నాయక్, సవిన్ మహార్, షేక్ అబ్బాస్,మరియు రాము,అశ్విత్,చిన్నయ్య,అజయ్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల్ (డీకే చార్లింపు)సెప్టెంబర్ 1: జిల్లాలో జాతీయ రహదారి 63 రహదారి నిర్మాణంలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి డి.ఎ.ఓ. రమేష్ తో కలిసి జాతీయ రహదారి విస్తరణలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమలు కానీ హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం...

## మాజి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య...



బెల్లంపల్లి(డీకే చాటింపు ) పట్టణంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశంను మంగళవారం బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అమలుకాని 6 గ్యారెంటీలు, 420 హామీలను 100 రోజులలోనే అమలుచేస్తామని నమ్మించి మోసపూరితంగా గద్దెనెక్కిన రేవంత్ ప్రభుత్వం 1000 రోజులు గడిచినప్పటికీ నేటివరకూ వాటిని పూర్తిస్థాయిలో అమలుచేయకుండా వంచించినందున కాంగ్రెస్ 420 మోసాలపై బీ ఆర్ ఎస్ పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 2. తేదీ నుండి 8 వరకు నియోజకవర్గంలో చేయాల్సిన నిరసన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నియోజకవర్గకేంద్రంలో ధర్నా, బాకీ కార్డులు పంచడం, 420 అడుగుల ఫ్లెక్సీ ప్రదర్శన కార్యక్రమానికి నియోజకవర్గవ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మావిగన్‌కు సమర్థింపుగా అవిగన్ తెస్తున్నారా



**విజయవాడ,** : మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత పేర్ని నాని ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమరావతి రాజధానిని అవిగన్ అమరావతి - విజయవాడ - గుంటూరు గా సిఆర్‌డిఎ లో తీర్మానం చేశారని, త్వరలోనే కేబినెట్ ముందుకు తీసుకురాబోతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన మావిగన్ కాస్తా ఇప్పుడు అవిగన్ గా మారిందని ఆయన సెటైర్లు వేశారు. అది జగన్ ఎఫెక్ట్ అంటున్నారు. మొదటగా సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌ను గమనిస్తే.. 2015లో అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పటి నుంచీ విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, తెనాలి సహా చుట్టుపక్కల వందలాది గ్రామాలు సీఆర్డీఏ పరిధిలోనే ఉన్నాయి. కోర్ క్యాపిటల్ సిటీగా 217 చదరపు కిలోమీటర్ల అమరావతి ప్రాంతం ఉంటే, దాని సమగ్ర అభివృద్ధికి 8,300 చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణాన్ని సీఆర్డీఏ పరిధిగా ప్రభుత్వం నిర్దేశించింది. ఇప్పుడు ప్రత్యేకంగా అవిగన్ పేరుతో క్రొత్తగా ఏదో తీర్మానం చేస్తున్నారని నాని చెప్పడం కేవలం ఒక కొత్త రాజకీయ అస్త్రాన్ని ప్రయోగించడమే తప్ప, అందులో కొత్తగా చట్టపరమైన మార్పు ఏదీ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. అయితే, పేర్ని నాని వ్యాఖ్యల్లో అంతర్లీనంగా ఉన్న రాజకీయ మార్పును గమనించాల్సి ఉంది ఐదేళ్ల పాటు మూడు రాజధానుల మంత్రం జపించి, అమరావతిని కేవలం ఒక రియల్ ఎస్టేట్ భ్రమ అని వర్ణించిన వైఎస్ఆర్‌సీపీ నేతలు.. ఇప్పుడు అమరావతి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల అనుసంధానత గురించి మాట్లాడుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో అమరావతిని పక్కనపెట్టడం వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పార్టీ తీవ్రంగా దెబ్బతిన్నది. 2024 ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల్లో వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న తర్వాత, అమరావతి ఉనికిని పూర్తిగా వ్యతిరేకించడం పార్టీ ఉనికికే ప్రమాదమని గుర్తించినట్లే కనిపిస్తోంది. ఈ పరిణామం వైఎస్ఆర్‌సీపీ అమరావతికి జై కొడుతోందా అనే ప్రశ్నకు ప్రత్యక్షంగా అవును అని చెప్పలేకపోయినా, పరోక్షంగా యు-టర్న్ తీసుకుంటోందనే సంకేతాలనైతే ఇస్తోంది.

రాజధాని నిర్మాణాన్ని నేరుగా అంగీకరిస్తే ఇన్నాళ్లూ తమ స్టాండ్ తప్పని ఒప్పుకున్నట్లు అవుతుంది. అందుకే, అమరావతి అభివృద్ధిని, సీఆర్డీఏ విస్తరణను కూటమి ప్రభుత్వం మళ్లీ మాట మారుస్తోంది అని నిందించే క్రమంలో అవిగన్ అనే పదాన్ని తెరపైకి తెచ్చారు. రాజధాని వ్యయాన్ని, నగరాల ఏకీకరణను ప్రశ్నించే పేరుతో అమరావతి చర్చలోకి వైఎస్ఆర్‌సీపీ మళ్లీ ప్రవేశించే యత్నం చేస్తోంది.ప్రభుత్వం వైపు నుంచి చూస్తే.. అమరావతిని కేవలం పాలనా నగరంగానే కాక, విజయవాడ, గుంటూరులను కలుపుతూ విశాలమైన మెగా సిటీ గా మౌలిక వసతులు అభివృద్ధి చేయడం మొదటి నుంచి ఉన్న ప్రతిపాదనే. గ్రీన్ ఫీల్డ్ క్యాపిటల్ అమరావతితో పాటు బ్రౌన్ ఫీల్డ్ నగరాలైన విజయవాడ, గుంటూరులను ఎకనామిక్ కారిడార్లుగా మార్చడం సీఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ముఖ్య ఉద్దేశం. దీనిని ప్రభుత్వం కొత్తగా దాచాల్సిన అవసరం గానీ, జగన్ దెబ్బకు భయపడి మార్చాల్సిన అవసరం గానీ లేదనేది అధికార కూటమి నేతల వాదన. పేర్ని నాని చేసినఅవిగన్‌వ్యాఖ్యలు వైఎస్ఆర్‌సీపీ మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పడుతున్నాయి. రాజధానిపై గతంలో తీసుకున్న కఠిన వైఖరిని పక్కనబెట్టి, సీఆర్డీఏ పరిధి, వ్యయం, నగరాల విలీనం వంటి అంశాలపై సాంకేతిక ప్రశ్నలు వేయడం ద్వారా అమరావతి ప్రాంత ప్రజల్లో పోయిన విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికి ఆ పార్టీ ప్రయత్నిస్తోంది. అయితే, ఈ మాటల విన్యాసాలు వైఎస్ఆర్‌సీపీకి ఎంతవరకు రాజకీయ ప్రయోజనం చేకూరుస్తాయో కాలమే నిర్ణయించాలి.

# జనహిత అన్నపూర్ణ 431 వ సారి అన్న దాన కార్యక్రమం....

### కీ.శే. జక్కుల రాజేశం గౌడ్ 6 వ వర్ధంతి సందర్భంగా అన్నదాన కార్యక్రమం...



బెల్లంపల్లి (డీకే చాటింపు ) మంగళవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్న దాన కార్యక్రమం 431 వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 431 వ సారి దాత కీ.శే. జక్కుల రాజేశం గౌడ్ 6 వ వర్ధంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమం లో సుమారు 180 మందికి ఒక పూట భోజనం అందించడం జరిగిందని ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కొరకు మరింత మంది దాతలు ముందుకు రావాలని అలాగే సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాత జనహిత సేవా సమితి సభ్యులు జక్కుల శ్రీనివాస్ గౌడ్, మిన్ను జనహిత సేవా సమితి సహాయ కార్యదర్శి దాసరి రంజిత్ గౌడ్, కార్యవర్గ సభ్యులు పన్నాల సదానందం, సత్యనారాయణ రెడ్డి నిచ్చకోల గురుస్వామి, బోనాల సతీష్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# 22ఏ నిషేధిత భూముల నుంచి పట్టా భూములను తొలగించాలి: మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల



**కరీంనగర్ :** రిజిస్ట్రేషన్ చట్టంలోని 22ఏ సెక్షన్‌ను దుర్వినియోగం చేస్తూ పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. నిషేధిత జాబితాలో ఉన్న అర్హత కలిగిన పట్టా భూములను వెంటనే తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. భూ బాధితులకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ. ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ తదితర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని 22ఏ సెక్షన్ ఉద్దేశించబడిందన్నారు. అయితే ఆ నిబంధనలను ఆధారంగా చేసుకుని ప్రైవేటు పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల వేలాది మంది భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.22ఏ 2 నిబంధనల ప్రకారం నిషేధిత జాబితాలో భూములను చేర్చే ప్రక్రియను చట్టబద్ధంగా చేపట్టాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కేవలం తహసీల్దార్, ఆర్డీవో లేదా జిల్లా కలెక్టర్ స్థాయిలోనే సర్వే నంబర్లను నిషేధిత జాబితాలో చేర్చడం సాధ్యం కాదని, ప్రభుత్వ స్థాయిలో నిర్దేశిత ప్రక్రియను పాటించాల్సి ఉంటుందని అన్నారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూముల విషయంలో భూ యజమానులకు న్యాయం జరిగేలా సమగ్రంగా పరిశీలించాలని కోరారు. ప్రైవేటు పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చే విషయంలో చట్టపరమైన ప్రక్రియను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 22ఏ సెక్షన్‌ను రాజకీయ ప్రయోజనాలు, అవినీతికి వేదికగా మార్చిందని ఆయన ఆరోపించారు. పట్టాదారులకు సరైన నోటీసులు ఇవ్వకుండా, నిర్దేశిత ప్రక్రియను పాటించకుండా వేలాది ఎకరాల భూములు, వేలాది ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని విమర్శించారు.ఊర్లకు ఊర్లే నిషేధిత జాబితాలో.కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని రేకుర్తి, కొత్తయాస్వాడ, విద్యానగర్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పట్టా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లాయని గంగుల కమలాకర్ తెలిపారు. రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాల్లో 22ఏ కారణంగా వేలాది మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఇటీవల వచ్చిన నివేదికలు కూడా పేర్కొంటున్నాయన్నారు గ్రామపంచాయతీ, మున్సిపల్ అనుమతులతో ఇళ్లు నిర్మించుకున్న వారు, ఏళ్ల తరబడి భూములను అనుభవిస్తున్న పట్టాదారులు సైతం ఇప్పుడు వాటిని విక్రయించుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్య, వైద్యం, వివాహాలు, కుటుంబ అవసరాల కోసం భూములను విక్రయించుకోవాల్సిన సమయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో బాధితులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.భూముల రికార్డుల విషయంలో ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు సమగ్రంగా పరిశీలించి స్పష్టత తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఒకవైపు అర్హత కలిగిన పట్టా భూములను 22ఏ జాబితాలో చేర్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ, మరోవైపు ప్రభుత్వ ప్రయోజనాల కోసం సేకరించిన భూముల రికార్డులు సరిచేయకపోవడం ఏంటని ప్రశ్నించారు.రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలిరాష్ట్రవ్యాప్తంగా 22ఏ సెక్షన్ దుర్వినియోగంపై నైతిక బాధ్యత వహించి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలోని రేకుర్తి, కొత్తయాస్వాడ, విద్యానగర్, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో నిషేధిత జాబితాలో చేర్చిన అర్హత కలిగిన పట్టా భూములను వెంటనే 22ఏ నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని గంగుల కమలాకర్ హెచ్చరించారు. అవసరమైతే పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి 'చలో సెక్రటేరియట్' కార్యక్రమానికి పిలుపునిస్తామని స్పష్టం చేశారు. భూ బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ వారి తరపున పోరాటం కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, టిఆర్ఎస్ నగర శాఖ అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, పలువురు టిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు,ప్రజా ప్రతినిధులు,భూ బాధితులు, బిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొండాకు రేవంత్ షాక్.



**వరంగల్:** మంత్రి కొండా సురేఖకు సంబంధించిన రాష్ట్రంలో పరిణామాలు తీవ్ర ఆసక్తిని రేపుతున్నాయి. కొండా సురేఖకు చెందిన పర్యావరణ, అటవీ శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. వారు పీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నిర్ణయం మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం లేకుండానే జరిగిందన్న ప్రచారం ఇప్పుడు సచివాలయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే మంత్రి కొండా సురేఖ వివాదం.. అటు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారం రేపుతున్నవేళ.. మరో ఘటన జరిగింది. రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖకు సంబంధించిన శాఖలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అటవీ శాఖలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న పలువురు అధికారులు, ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే మంత్రి కొండా సురేఖకు ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ఈ నిర్ణయం జరిగిందన్న ప్రచారం ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో చర్చకు దారితీసింది.డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారులు వెంటనే పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్) కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించినట్లు సమాచారం. అయితే ఈ నిర్ణయం వెనుక పరిపాలనా కారణాలే ఉన్నాయా లేక ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలతో దీనికి ఏమైనా సంబంధం ఉందా అనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో మొదలైంది.అటవీ శాఖలో వివిధ బాధ్యతల్లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న పలువురు ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా ఆయా శాఖకు సంబంధించిన కీలక పరిపాలనా నిర్ణయాలు సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లడం ఆనవాయితీగా ఉంటుంది. అయితే.. తాజాగా అధికారుల డిప్యూటేషన్ రద్దు వ్యవహారంలో మంత్రి కొండా సురేఖకు ముందుగా సమాచారం ఇవ్వలేదన్న ప్రచారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.అయితే అటవీ శాఖలో అధికారుల డిప్యూటేషన్లను ఎందుకు రద్దు చేశారు.. ఏయే అధికారులను వెనక్కి పంపిస్తున్నారు.. అటవీ శాఖలో తదుపరి ఎలాంటి మార్పులు ఉండబోతున్నాయి అనే అంశాలపై అధికార వర్గాల్లో ముమ్మరంగా చర్చ జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ నిర్ణయాన్ని పరిపాలనా చర్యల్లో భాగంగానే తీసుకున్నదా అన్నది స్పష్టత రావాల్సి ఉంది.మరోవైపు.. తన విదేశీ పర్యటన తర్వాత తాజాగా మీడియా సమావేశం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. మంత్రి కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితకు సంబంధించిన వివాదంపైస్పందించారు. ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిధిలో ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పార్టీ అంతర్గత అంశాలపై తాను బహిరంగంగా మాట్లాడబోనని పేర్కొన్నారు. అధిష్ఠానం లేదా క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కట్టుబడి ఉండాల్సిందేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.ఒకవైపు కొండా సురేఖ వ్యవహారంపై పార్టీ క్రమశిక్షణ కమిటీ పరిశీలన కొనసాగుతుండగా..మరోవైపు ఆమె నిర్వహిస్తున్న అటవీ శాఖలో డిప్యూటేషన్లు రద్దు కావడం రాజకీయంగా తీవ్ర ఆసక్తిని పెంచింది. ఈ రెండు పరిణామాలు ఒకే సమయంలో చోటుచేసుకోవడంతో తెలంగాణ కాంగ్రెస్‌లో దీనిపై విస్తృత చర్చ జరుగుతోంది. అయితే డిప్యూటేషన్ల రద్దు నిర్ణయాన్ని కొండా సురేఖ వ్యవహారంతో ముడిపెట్టడానికి అధికారికంగా ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదు. పరిపాలనా అవసరాల నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుని ఉండొచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

# సిద్ధాంతాల ఆధారంగానే పదవులు

**న్యూఢిల్లీ,** : భారత రాజకీయాల్లో వారసత్వం, కుటుంబ నేపథ్యం అనేది నాయకత్వ అర్హతగా మారిన తరుణంలో, భారతీయ జనతా పార్టీ మాత్రం కింది స్థాయి కార్యకర్త నుంచి అగ్ర నాయకుడిగా ఎదిగే సిద్ధాంతానికే మొగ్గు చూపుతోంది. ఇటీవల ప్రకటించిన పార్టీ కొత్త జాతీయ కార్యవర్గంలో సైతం ఈ తరహా క్యాడర్-బేస్డ్ లీడర్‌షిప్‌కే అధిష్ఠానం పెద్దపీట వేసింది. కేవలం ఒక పొలిటికల్ ప్యాషన్ , క్రమశిక్షణ, భావజాలం పట్ల అంకితభావంతో పనిచేసే సాధారణ కార్యకర్తకు కూడా నంబర్-1 స్థానాన్ని అధిష్టించే అవకాశం కల్పించడమే తమ శ్రేణుల బలం అని బీజేపీ మరోసారి రుజువు చేసింది. ఈ గ్రాస్‌రూట్ మోడల్ కు స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే అతిపెద్ద ఉదాహరణ. గుజరాత్‌లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, సాదాసీదా కార్యకర్తగా ప్రయాణం ప్రారంభించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా ఎదిగిన విధానం బీజేపీ సిద్ధాంతానికి నిలువెత్తు సాక్ష్యం. తాజాగా పార్టీ అత్యున్నత అధ్యక్ష బాధ్యతలను చేపట్టిన నితిన్ నబీన్ ప్రయాణం కూడా ఇందుకు భిన్నమైనది కాదు. యువజన మోర్చా స్థాయి నుంచి సుదీర్ఘకాలం పాటు క్షేత్రస్థాయిలో చెమటోడ్చి, కష్టపడి పనిచేసిన నైపుణ్యాన్ని గుర్తించే పార్టీ జాతీయ నాయకత్వ పగ్గాలను ఆయనకు అప్పగించింది.కొత్త జాతీయ కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా ఎంపికైన రామ్ మాధవ్ , ఆల్ సెల్స్ కో కన్వీనర్‌గా స్థానం పొందిన విష్ణువర్ధన్ రెడ్డి వంటి నేతల ప్రయాణం ఆర్ఎస్ఎస్, ఏబీవీపీల పునాదుల మీదే సాగింది. రామ్ మాధవ్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లో క్షేత్రస్థాయి స్వయంసేవక్‌గా పొలిటికల్ డిప్లొమసీని, సిద్ధాంత పటిష్టతను నేర్చుకుని బీజేపీ జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారారు. అలాగే ఏపీకి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి విద్యార్థి విభాగమైన ఏబీవీపీ ద్వారా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి, ఎన్నో పోరాటాలు చేసి ఈ స్థాయికి చేరుకున్నారు. ఇవి కేవలం ఉద్యోగ బాధ్యతలు కావు, సిద్ధాంతం పట్ల ఉండే 'ప్యాషన్'.అధికార మార్పిడి , పదవుల పంపకంలో వారసత్వ రాజకీయాల ను పూర్తిగా పక్కనపెట్టడం బీజేపీకి సంస్థాగతంగా కొన్ని ప్రధాన ప్రయోజనాలను తెచ్చిపెడుతోంది. ఏ మూలన ఉన్న సాధారణ శ్రేణి నేతలకైనా, నేను కూడా రేపు జాతీయ స్థాయి నేతను కాగలను అనే ఆశ, ఉత్సాహం నిరంతరం పని చేసేలా ప్రేరేపిస్తాయి. పక్షపాతం లేకుండా పనితీరు, ఫలితాలే ప్రాతిపదికగా ప్రమోషన్లు ఇవ్వడం వల్ల పార్టీ నడిపించే వ్యూహకర్తలకు క్షేత్రస్థాయి సమర్థత దక్కుతుంది. ప్రత్యర్థి పార్టీలలో నడుస్తున్న కుటుంబ పాలన ను నిలదీసే నైతిక బలం ఒక్క బీజేపీకే సాధ్యమవుతుంది. ఈ గ్రాస్‌రూట్ నాయకత్వ నమూనాలో కొన్ని అంతర్గత సవాళ్లు కూడా లేకపోలేదు. క్షేత్రస్థాయి నుంచి కష్టపడి వచ్చిన నేతలకు సిద్ధాంతపరమైన నిబద్ధత ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో విభిన్న సామాజిక సమీకరణాలను, గ్లామరస్ పాపులిజమ్‌ను తట్టుకుని ఓట్లుగా మలచడం ఒక్కోసారి క్లిష్టంగా మారుతుంది. అంతేకాకుండా ఇతర పార్టీల నుంచి వచ్చే మాస్ లీడర్లకు, కింది స్థాయి నుంచి ఎదిగిన ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న 'ఆర్గనైజేషనల్' నేతలకు మధ్య సమన్వయం కుదర్చడం జాతీయ నాయకత్వానికి పెద్ద సవాలుగా మారుతుంటుంది. బీజేపీ నిలకడగా విజయం సాధించడానికి, ఇతర ప్రాంతీయ పార్టీల వలె ఏ ఒక్క కుటుంబం చేతిలో చిక్కుకోకుండా ఉండటానికి ఈ బాటమ్-టు-టాప్ విధానమే మూలస్తంభం. రాజకీయాన్ని వ్యాపారంగా కాకుండా ఒక బాధ్యతగా, ప్యాషన్‌గా భావించి రూట్ లెవెల్ నుంచి కష్టపడే వారికి బీజేపీలో ఎల్లప్పుడూ ప్రాధాన్యత దక్కుతుందనే సందేశాన్ని సరికొత్త జాతీయ కార్యవర్గ ఎంపిక మరోసారి స్పష్టంగా చాటిచెప్పింది.


# తెలంగాణలో వేలాది ప్రైవేట్ ఆస్తులు 22ఏ నిషేధిత జాబితాలో చేరిక




హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో వేలాది మంది ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరోవైపు, ఈ అంశంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి.రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను అక్రమ బదిలీల నుంచి కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'భూ భారతి' విధానంలోకి మారే క్రమంలో, 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి ఖరీదైన ప్రాంతాలతో పాటు, దశాబ్దాల క్రితం హుడా, హెచ్ఎండీఏ అనుమతులతో ఏర్పడిన కాలనీలు, అపార్ట్‌మెంట్లు కూడా ఈ జాబితాలో చేరాయి. రిజిస్ట్రేషన్ కోసం వెళ్లినప్పుడే తమ ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని యజమానులకు తెలియడంతో వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే సుమారు 6,000 కేసులు హైకోర్టులో నడుస్తున్నాయి. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, అధికారుల నిర్లక్ష్యం, పొరపాట్ల వల్లే ఇది జరిగిందని అంగీకరించారు. నిజమైన యజమానులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు తెలిపారు. సమస్య పరిష్కారానికి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఫిర్యాదుల కోసం టోల్-ఫ్రీ నంబర్ (1800-599-4788) కూడా ప్రారంభించామని ప్రకటించారు. ఫిర్యాదు అందిన మూడు రోజుల్లో స్పందిస్తామని హామీ ఇచ్చారు.మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయంపై మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్న ఆస్తుల వివరాలను రెండు రోజుల్లో ధృవీకరించి, అవి ప్రైవేట్ ఆస్తులని తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. "ఒక్క అంగుళం ప్రైవేట్ భూమికి కూడా నష్టం జరగనివ్వం" అని స్పష్టం చేస్తూ, దళారులను ఆశ్రయించవద్దని ప్రజలకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇప్పటికే మేడ్చల్-మల్కాజ్‌గిరిలో 30, రంగారెడ్డిలో 4 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి.ఈ పరిణామంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని, డిసెంబర్ 2023 నుంచి జాబితాలో చేర్చిన ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్ చేశారు. జాబితా నుంచి పేర్లు తొలగించడానికి కొందరు అధికారులు కమిషన్లు డిమాండ్ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బాధితులకు ఉచిత న్యాయ సహాయం అందించేందుకు తెలంగాణ భవన్‌లో లీగల్ ఎయిడ్ సెల్‌ను ప్రారంభించారు. బీజేపీ నేతలు కూడా ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్దేశపూర్వకంగా ఏ ఒక్క ప్రైవేట్ ఆస్తిని జాబితాలో చేర్చలేదని, కేవలం పొరపాట్లను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. బాధిత యజమానులు తమ ఆస్తుల వివరాలను అధికారిక వెబ్‌సైట్లలో చూసుకోవాలని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్గాలను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు

# 12 ఏళ్లలో రైటాఫ్ రుణాల విలువ రూ. 10 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ,** : బ్యాంకులు, ఆర్థిక సంస్థలు పెద్ద పెద్ద వ్యాపారులకు, కార్పొరేట్లకు, ఇతర సర్వీస్ సెక్టార్లో బారోవర్లకు పెద్ద మొత్తంలో లోన్లు ఇస్తుంటాయి. ఇక్కడ చాలా మంది తిరిగి చెల్లించక మొండి బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోతుంటాయి. వీటిని బ్యాంకింగ్ పరిభాషలో నాన్ పెర్ఫామింగ్ అసెట్స్ అంటారు. ఇక బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తాము ఇచ్చిన లోన్లను తిరిగి రాబట్టుకోవడం కష్టమనిపిస్తేవాటిని బ్యాంకులు తాత్కాలికంగా రద్దు చేస్తుంటాయి. దీనినే లోన్ రైటాఫ్ (లోన్ల సాంకేతికంగా రద్దు) అని పిలుస్తారు. ఇక్కడ గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే రైటాఫ్ చేసినంత మాత్రాన లోన్లు రద్దయినట్లు కాదు. ఇది రుణ మాఫీ ఏ మాత్రం కాదు. లోన్ రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటాయి. అయితే బ్యాలెన్స్ షీట్ నుంచి మాత్రమే ఈ లోన్లను తొలగిస్తారు. ఇక్కడ నిరర్ధక ఆస్తుల్ని తగ్గించుకునేందుకు, లాభదాయకత చూయించుకునేందుకు బ్యాంకులు చేసే సాంకేతిక ప్రక్రియనే లోన్ రైటాఫ్ అంటారు.ఇక ఇలా గత 12 ఏళ్లలో చూస్తే ఇలా పెద్ద కార్పొరేట్ రుణ గ్రహీతలకు ఇచ్చిన దాదాపు రూ. 9.95 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు వెల్లడించింది. ఇక్కడ రుణాల్ని రైటాఫ్ చేయడం అంటే రుణ గ్రహీతలకు అప్పును మాఫీ చేసినట్లు కాదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాల్ని వెల్లడించారు. ఇక బ్యాంకుల రుణ రైటాఫ్‌లో గత కొన్నేళ్లుగా గణనీయమైన మార్పు కనిపిస్తోందని గణాంకాలు చెబుతున్నాయి.బ్యాంకులు రైటాఫ్ చేసిన రుణాల్లో అత్యధిక మొత్తం 2018-19 ఆర్థిక సంవత్సరంలో నమోదైంది. ఆ ఏడాదిలో ఏకంగా రూ. 1,48,753 కోట్ల రుణాల్ని బ్యాంకులు సాంకేతికంగా రద్దు చేశాయి. తర్వాతి సంవత్సరాల్లో చూస్తే రైటాఫ్ చేసిన రుణాల సంఖ్య క్రమంగా



తగ్గుతూ వచ్చింది. కిందటి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 20,485 కోట్ల రుణాల్ని రైటాఫ్ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. 2018-19తో పోలిస్తే 2025-26 లో రైటాఫ్ చేసిన రుణాల మొత్తం భారీగా తగ్గింది. ఇక గత 12 ఏళ్ల లెక్కల్ని చూస్తే మాత్రం దాదాపుగా రైటాఫ్ రుణాల విలువ రూ. 10 లక్షల కోట్లకు చేరడం గమనార్హం.చాలా మంది మాత్రం రుణాల రైటాఫ్ అంటే రుణ మాఫీగా భావిస్తుంటారు. కానీ ఈ రెండూ ఒకటి కాదు. బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్లను సరిచేసుకునేందుకు, మొండి బకాయిల్ని పుస్తకాల నుంచి తొలగించేందుకు రైటాఫ్ ప్రక్రియను ఉపయోగిస్తుంటాయి. ఇక్కడ రైటాఫ్ చేసినా బ్యాంకులు వర్తించే నిబంధనలు, చట్టపర మార్గాల ప్రకారం ఆ లోన్లను తిరిగి వసూలు చేసేందుకు చర్యలు కొనసాగించవచ్చు. చెల్లింపులు చేయకపోతే రుణాలు మొండి బకాయిలుగా మారతాయి. అలాంటి ఖాతాలపై బ్యాంకులు రికవరీ చర్యలు చేపడతాయి. అయితే కొన్ని సందర్భాల్లో లోన్ తిరిగి వసూలు చేయడం కష్టంగా మారుతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనే నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులు లోన్లను రైటాఫ్ చేయొచ్చు.

# నాసిక్, సూరత్ తర్వాత రంగారెడ్డి..

హైదరాబాద్, ఆగస్టు 25: ఆర్థికంగా వేగంగా ఎదుగుతున్న ప్రాంతాల్లో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాకు చోటు దక్కింది. జైపూర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్‌తో పాటు రంగారెడ్డి తన ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నట్లు 'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్' తాజా నివేదిక వెల్లడించింది. దేశ ఆర్థిక వృద్ధి ఇక సంప్రదాయ మెట్రో నగరాలకే పరిమితం కాకుండా కొత్త ప్రాంతాలకు విస్తరిస్తోందని తెలిపింది.'డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ సిటీ వైటాలిటీ ఇండెక్స్' ప్రకారం దేశంలో అత్యంత ఆర్థికంగా కీలకమైన మెట్రో నగరంగా పుణె నిలిచింది. ఐటీ సేవలు, అధునాతన తయారీ, ఆటోమొబైల్, విద్య, ఆవిష్కరణ ఆధారిత కార్యకలాపాలు పుణెకు కలిసొచ్చాయి. అహ్మదాబాద్ రెండో స్థానంలో నిలిచింది. మెట్రో నగరాల్లో ఆర్థిక వృద్ధి వేగం విషయంలో కోల్‌కతా ముందుంది.ఏప్రిల్-జూన్ 2026 కాలానికి రూపొందించిన సూచీలో దేశవ్యాప్తంగా 800కుపైగా జిల్లాలను పరిశీలించారు. ఉపగ్రహ ఆధారిత భౌగోళిక పరిశీలన డేటాతో పాటు ఆర్థిక సూచీలను ఇందుకు ఉపయోగించారు. అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో సౌత్ 24 పరగణాస్ అగ్రస్థానంలో నిలిచింది. నార్త్ 24 పరగణాస్, థానే తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. జైపూర్, నాసిక్, సూరత్, ముర్షిదాబాద్, రంగారెడ్డి ప్రాంతాలు కూడా తమ ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకుంటున్నాయని నివేదిక పేర్కొంది. గత దశాబ్దంలో దిమాపూర్, పంచమహల్స్, ఆనంద్, అయోధ్య, రాంపూర్, బస్తీ, షామ్లీ, బౌధ్, ఔరంగాబాద్, కోడెర్మా వంటి జిల్లాలు స్థిరమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేశాయి.దేశంలో పట్టణీకరణ మరింత విస్తృతంగా జరుగుతోందని నివేదిక పేర్కొంది. పెట్టుబడులు, వ్యాపారాలు, ప్రతిభావంతులైన మానవ వనరులు, మౌలిక వసతులు కొత్త నగరాల వైపు వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపింది. భవిష్యత్ పెట్టుబడులకు ఈ కొత్త వృద్ధి మార్గాలు కీలకంగా మారనున్నాయని డన్ అండ్ బ్రాడ్‌స్ట్రీట్ అభిప్రాయపడింది.

# షుగర్ పేషెంట్లు జామపండు తినొచ్చా...?



పండ్లు ఆరోగ్యానికి మంచివే అయినా.. షుగర్, బీపీ వంటి సమస్యలు ఉన్నవారు ఏ పండు పడితే అది తినకుండా కొన్ని విషయాలను తప్పక గమనించాలి. ముఖ్యంగా తీపి ఎక్కువగా ఉండే పండ్ల విషయంలో చాలామందికి సందేహాలు ఉంటాయి. అయితే జామపండు మాత్రం ఫైబర్, విటమిన్ అ వంటి పోషకాలు సమృద్ధిగా ఉండే పండుగా గుర్తింపు పొందింది. జామపండులో ఫైబర్ ఉండటం వల్ల రక్తంలో గ్లూకోజ్ వేగంగా పెరగకుండా ఉండేందుకు సహాయపడే ఆహార ఎంపికగా పరిగణించవచ్చు. ముఖ్యంగా జ్యూస్ రూపంలో కాకుండా మొత్తం పండుగా తినడం వల్ల ఫైబర్ కూడా లభిస్తుంది. అయితే డయాబెటిస్ ఉన్నవారు ఎంత మోతాదులో తినాలి అనేది వారి మొత్తం ఆహారం, మందులు, రక్తంలో చక్కెర స్థాయులపై ఆధారపడి ఉంటుంది. జామపండులో విటమిన్ అ గణనీయంగా ఉంటుంది. ఈ విటమిన్ శరీరంలో సాధారణ రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు అవసరం. యాంటీఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. అందువల్ల ఆహారంలో జామపండును చేర్చుకోవడం ద్వారా విటమిన్ అ అవసరాల్లో కొంత భాగాన్ని పొందవచ్చు. జామపండులో డైటరీ ఫైబర్ ఉంటుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి, మలబద్ధకం తగ్గడానికి సహాయపడుతుంది. సమతుల్య ఆహారంలో ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను చేర్చుకోవడం సాధారణంగా ఆరోగ్యకరమైన అలవాటుగా పరిగణిస్తారు. బీపీ ఉన్నవారు జామపండును ఆహారంలో భాగంగా తీసుకోవచ్చు. అయితే జామపండు బీపీని తగ్గించే మందు కాదు. బీపీ నియంత్రణకు ఉప్పు పరిమితం చేయడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, శారీరక చురుకుదనం, వైద్యులు సూచించిన మందులు వాడటం వంటి చర్యలు ముఖ్యమైనవి. జామపండు వంటి పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ఆరోగ్యకరమైన ఆహార విధానంలో ఒక భాగంగా ఉండొచ్చు. కానీ కేవలం జామపండు తినడం వల్ల అధిక రక్తపోటు తగ్గిపోతుందని భావించకూడదు. జామపండును శుభ్రంగా కడిగి, ముక్కలుగా కోసుకుని నేరుగా తినడం మంచి మార్గం. దానికి అదనంగా చక్కెర, ఉప్పు, మసాలాలు ఎక్కువగా కలపాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారు జామపండు జ్యూస్ కంటే పండుగానే తీసుకోవడం మంచిది. పండును నమిలి తినడం వల్ల దానిలోని ఫైబర్ కూడా ఆహారంలో భాగమవుతుంది. జామపండు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ అ వంటి పోషకాలను అందిస్తుంది. అయితే దీనిని ప్రత్యేకంగా 'డిటాక్స్ ఫుడ్'గా తీసుకుని శరీరంలోని అన్ని టాక్సిన్లను తొలగిస్తుందని చెప్పడం సరైంది కాదు.

## చిన్న వయసులోనే కీళ్ల నొప్పులా....?



కీళ్ల నొప్పులు అంటే వృద్ధాప్యంలో వచ్చే సమస్యగానే చాలామంది భావిస్తారు. కానీ ప్రస్తుతం యువతలోనూ మోకాళ్లు, భుజాలు, మోచేతులు, మణికట్టు వంటి కీళ్లలో నొప్పి, బిగుతు, వాపు వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. స్పోర్ట్స్ ఆడేవారు, జిమ్‌లో అధికంగా వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు మాత్రమే కాకుండా.. రోజువారీ జీవితంలో ఒకే రకమైన కదలికలను పదేపదే చేసే వారిలోనూ ఈ సమస్య తలెత్తవచ్చు. కీళ్ల నొప్పులు అంటే వృద్ధాప్యంలో వచ్చే సమస్యగానే చాలామంది భావిస్తారు. కానీ ప్రస్తుతం యువతలోనూ మోకాళ్లు, భుజాలు, మోచేతులు, మణికట్టు వంటి కీళ్లలో నొప్పి, బిగుతు, వాపు వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. స్పోర్ట్స్ ఆడేవారు, జిమ్‌లో అధికంగా వ్యాయామం చేసేవారు, శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారు మాత్రమే కాకుండా.. రోజువారీ జీవితంలో ఒకే రకమైన కదలికలను పదేపదే చేసే వారిలోనూ ఈ సమస్య తలెత్తవచ్చు.కీళ్ల నొప్పులకు ఒక్కటే కారణం ఉండదు. గాయం, బెణకడం, కండరాలపై అధిక ఒత్తిడి వంటివి కీలు చుట్టూ ఉన్న కణజాలాన్ని దెబ్బతీసి నొప్పి, వాపుకు కారణమవుతాయి. ముఖ్యంగా క్రీడల్లో పాల్గొనే యువతలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా కనిపించవచ్చు. మరో కారణం గౌట్. శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయులు పెరిగి దాని స్ఫటికాలు కీళ్లలో పేరుకుపోతే అకస్మాత్తుగా తీవ్రమైన నొప్పి, వాపు, ఎరుపు, వేడి వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధుల్లో రోగనిరోధక వ్యవస్థ పొరపాటున కీళ్లపై దాడి చేయడం వల్ల నొప్పి, వాపు ఏర్పడతాయి. వయసుతో ఎక్కువగా సంబంధం ఉన్న ఆస్టియో ఆర్థరైటిస్ కూడా కొన్ని సందర్భాల్లో చిన్న వయసులోనే కనిపించవచ్చు.

కీళ్ల మధ్య ఉండే మృదులాస్థి దెబ్బతినడం, అరిగిపోవడం వల్ల కదలికలో నొప్పి, బిగుతు ఏర్పడుతుంది. ఇవే కాకుండా టెండినైటిస్, లూపస్, ఫైబ్రోమయాల్జియా, థైరాయిడ్ సమస్యలు, కొన్ని వైరల్ ఇన్ఫెక్షన్లు కూడా కీళ్ల నొప్పులకు కారణం కావచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. కీళ్ల నొప్పితో పాటు వాపు, ఎరుపు, అధిక వేడి లేదా జ్వరం ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. గాయం తర్వాత కీలు ఆకారం మారడం, అకస్మాత్తుగా తీవ్రమైన వాపు రావడం లేదా నొప్పి కారణంగా కీలును కదపలేకపోవడం వంటి పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా వైద్య సహాయం తీసుకోవాలి. తేలికపాటి నొప్పి కొన్నిసార్లు విశ్రాంతితో తగ్గిపోవచ్చు.

## బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగారా?

ఉదయం నిద్రలేవగానే బ్లాక్ కాఫీ తాగే అలవాటు చాలామందికి ఉంటుంది. అయితే ఇటీవల బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగడం కూడా సోషల్ మీడియాలో ట్రెండ్‌గా మారింది. ఈ డ్రింక్ తాగితే



త్వరగా బరువు తగ్గొచ్చని, శరీరంలోని కొవ్వు కరిగిపోతుందని, డిటాక్స్ అవుతుందని ప్రచారం జరుగుతోంది. బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి.. బరువు తగ్గించే అద్భుతమైన పానీయంగా భావించడం సరైంది కాదు. బ్లాక్ కాఫీలో ఉండే కెఫీన్ కొంతసేపు శక్తిని పెంచుతుంది. కొంతమందిలో ఆకలిని స్వల్పంగా తగ్గించే ప్రభావం కూడా ఉండొచ్చని యథార్థ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లోని డైటెటిక్స్ విభాగం అధిపతి సుహానీ సేథ్ అగర్వాల్ అంటున్నారు. అయితే ఈ ప్రభావంతోనే శరీరంలోని అదనపు కొవ్వు వేగంగా కరిగిపోతుందని చెప్పడానికి ఆధారాలు లేవట. బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలపడం వల్ల అదనంగా కొవ్వు కరుగుతుందని లేదా వేగంగా బరువు తగ్గుతారని నిరూపించే బలమైన శాస్త్రీయ ఆధారాలు ప్రస్తుతం లేవు. కాఫీలోని కెఫీన్ కొద్దిసేపు జీవక్రియను, శక్తి వినియోగాన్ని పెంచవచ్చు. కానీ ఈ ప్రభావం పరిమితంగానే ఉంటుంది.

## కళ్లలో పసుపు రంగు కనిపిస్తోందా?

కొన్ని ఆరోగ్య సమస్యలు శరీరంలో మార్పులు మొదలైన వెంటనే మనకు తెలియజేస్తాయి. కానీ కొన్ని వ్యాధుల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ముఖ్యంగా ప్యాంక్రియాస్‌కు సంబంధించిన క్యాన్సర్ ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే సాధారణ జీర్ణ సమస్యలుగా భావించి కొన్ని సంకేతాలను చాలామంది పట్టించుకోరు. ప్యాంక్రియాస్ లేదా క్లోమం పొట్ట లోపల, కడుపు వెనుక భాగంలో ఉండే ముఖ్యమైన అవయవం. జీర్ణక్రియకు అవసరమైన ఎంజైమ్‌లను తయారు చేయడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించే హార్మోన్ల ఉత్పత్తిలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ అవయవంలో క్యాన్సర్ ఏర్పడినప్పుడు ప్రారంభంలో పెద్దగా లక్షణాలు కనిపించకపోవచ్చు. కణితి పెరిగి చుట్టుపక్కల అవయవాలు లేదా పిత్తనాళాలపై ప్రభావం చూపినప్పుడు కొన్ని లక్షణాలు బయటపడే అవకాశం ఉంటుంది. చర్మం లేదా కళ్ల తెల్లని భాగం పసుపు రంగులోకి మారడం జాండిస్ (కామెర్లు) లక్షణం కావచ్చు. ప్యాంక్రియాస్‌లోని కణితి పిత్తనాళాన్ని అడ్డుకుంటే బిలిరుబిన్ శరీరంలో పేరుకుపోయి ఈ మార్పు రావచ్చు. మూత్రం ముదురు రంగులోకి మారడం, మలం లేత రంగులో కనిపించడం, చర్మంపై తీవ్రమైన దురద కూడా దీనితో పాటు ఉండొచ్చు. ఆహారంలో పెద్దగా మార్పులు చేయకపోయినా బరువు తగ్గడం గమనిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌తో పాటు అనేక ఇతర ఆరోగ్య సమస్యల్లోనూ అనుకోకుండా బరువు తగ్గడం కనిపించవచ్చు. అందువల్ల ఈ ఒక్క లక్షణం ఆధారంగా క్యాన్సర్ అని నిర్ధారించుకోకూడదు. కానీ నిరంతరంగా బరువు తగ్గుతుంటే వైద్య పరీక్ష అవసరం. పొత్తికడుపు పైభాగంలో నొప్పి లేదా మధ్య భాగం వెన్ను వరకు వ్యాపించే నొప్పి కూడా ఒక సంకేతంగా ఉండొచ్చు. అయితే ఇలాంటి నొప్పికి గ్యాస్,



జీర్ణ సమస్యలు, కండరాల సమస్యలు వంటి ఎన్నో కారణాలు ఉండవచ్చు. నొప్పి కొత్తగా మొదలై తగ్గకుండా కొనసాగుతున్నా, క్రమంగా ఎక్కువవుతున్నా వైద్యుడిని సంప్రదించడం మంచిది. ప్యాంక్రియాటిక్ క్యాన్సర్‌లో ఆకలి తగ్గడం, వికారం, వాంతులు, పొట్ట ఉబ్బరం, త్వరగా కడుపు నిండినట్లు అనిపించడం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు కనిపించవచ్చు. కొందరిలో కొవ్వు ఎక్కువగా ఉన్నట్లుగా కనిపించే లేదా లేత రంగులో ఉండే మలం కూడా కనిపించవచ్చు. ప్యాంక్రియాస్ ఇన్సులిన్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల కొంతమందిలో ప్యాంక్రియాస్‌కు సంబంధించిన సమస్యలతో కొత్తగా డయాబెటిస్ బయటపడవచ్చు లేదా ఇప్పటికే ఉన్న షుగర్ నియంత్రణ కష్టంగా మారవచ్చు. ముఖ్యంగా ఇతర లక్షణాలతో పాటు అకస్మాత్తుగా రక్తంలో చక్కెర స్థాయులు మారితే వైద్యుడితో చర్చించడం మంచిది. ఎటువంటి స్పష్టమైన కారణం లేకుండా శరీరమంతా తీవ్రమైన దురద రావడం కూడా కొన్నిసార్లు జాండిస్‌తో సంబంధం కలిగి ఉండవచ్చు.

## ఉదయం నిద్ర లేవగానే చాలా సేపటి వరకు నడుము బిగుతుగా ఉంటుందా



దయం నిద్రలేవగానే నడుము బిగుసుకుపోయినట్టు అనిపించడం చాలామందికి సాధారణ సమస్యగా కనిపిస్తుంది. అయితే ఈ నొప్పి ప్రతిరోజూ కొనసాగుతూ గంటల పాటు తగ్గకపోతే, అది తీవ్రమైన వెన్నెముక సమస్యకు సంకేతం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అంకిలోజింగ్ స్పాండిలైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రారంభ లక్షణంగా దీన్ని పరిగణిస్తున్నారు. తాజాగా వచ్చిన ఒక అధ్యయనం ప్రకారం హోల్ బాడీ క్రయోథెరపీ అనే చికిత్సా విధానం ఈ సమస్యతో బాధపడుతున్న వారికి ఉపశమనం కలిగించే అవకాశముందని వెల్లడైంది. అంకిలోజింగ్ స్పాండిలైటిస్ అనేది వెన్నెముక, కీళ్లను ప్రభావితం చేసే దీర్ఘకాలిక ఇన్‌ఫ్లమేటరీ వ్యాధి.

వెంటనే వైద్యులను సంప్రదించాలి..ఈ సమస్య ఉన్నవారిలో ఉదయం సమయంలో నొప్పి, బిగుతు, కదలికల్లో ఇబ్బందులు ఎక్కువగా కనిపిస్తాయి. శరీరం విశ్రాంతిలో ఉన్నప్పుడు కండరాలు గట్టిపడటం వల్ల ఉదయాన్నే నొప్పి తీవ్రమవుతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్య పెరుగుతున్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. నిపుణుల ప్రకారం కొన్ని లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఉదయం నడుము నొప్పి గంటకు పైగా కొనసాగడం, ప్రతిరోజూ పునరావృతం కావడం, విశ్రాంతి తీసుకున్నప్పుడు నొప్పి పెరగడం, కదలికలతో కొంత ఉపశమనం కలగడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. కుటుంబంలో ఆర్థరైటిస్ చరిత్ర ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. యూరోపియన్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన తాజా సమీక్షలో హోల్ బాడీ క్రయోథెరపీ వల్ల అంకిలోజింగ్ స్పాండిలైటిస్ రోగులకు ప్రయోజనం కలగవచ్చని వెల్లడైంది.క్రయోథెరపీతో మెరుగైన ఫలితాలు..మొత్తం 310 మంది రోగులపై నిర్వహించిన ఐదు అధ్యయనాల డేటాను విశ్లేషించగా, ఈ థెరపీ వల్ల నొప్పి, ఉదయపు బిగుతు తగ్గినట్లు గుర్తించారు. అలాగే శరీర కదలికలు మెరుగుపడటంతోపాటు రోగుల జీవన నాణ్యత కూడా కొంత మెరుగైనట్టు అధ్యయనంలో తేలింది. క్రయోథెరపీ అనేది శరీరాన్ని అత్యల్ప ఉష్ణోగ్రతలకు కొద్దిసేపు గురిచేసే చికిత్సా విధానం. సాధారణంగా మైనస్ ఉష్ణోగ్రతల్లో 80 సెకన్ల నుంచి మూడు నిమిషాల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. దీని వల్ల శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గి కండరాలు సడలుతాయి. అయితే ఇది పూర్తిస్థాయి చికిత్స కాదని, కేవలం సహాయక థెరపీగా మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేస్తున్నారు.అందరికీ పడకపోవచ్చు..అయితే ఈ థెరపీ అందరికీ అనుకూలం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.


## గర్భధారణ సమయంలో మహిళలకు వచ్చే ముఖ్యమైన సమస్యలు ఇవే...

గర్భధారణ ప్రతి మహిళ జీవితంలో ఎంతో ఆనందకరమైన దశ. అయితే ఈ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడంతో కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం కూడా ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇవి తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తాయి.

అందుకే గర్భధారణ సమయంలో క్రమం తప్పని వైద్య పరీక్షలు, పోషకాహారం, ఆరోగ్యకర జీవనశైలి చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా రక్తహీనత, అధిక రక్తపోటు, గర్భకాల మధుమేహం వంటి సమస్యలను ముందుగానే గుర్తిస్తే ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇదే విషయంపై నేషనల్ సేఫ్ మదర్‌హుడ్ డేను ఈ సమయంలో నిర్వహిస్తారు. గర్భిణీల ఆరోగ్యం, మాతృ మరణాల తగ్గింపు, సురక్షిత ప్రసవాలపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. సరైన వైద్య సేవలు, గర్భధారణ సమయంలో పరీక్షలు, ప్రసవానంతర సంరక్షణ ప్రతి మహిళకు అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.గర్భస్థ సమయంలో మధుమేహం..ఇక గర్భధారణ సమయంలో ఎక్కువగా కనిపించే సమస్యల్లో గర్భకాల మధుమేహం ఒకటి. ఈ పరిస్థితిలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల శిశువు అధిక బరువుతో పుట్టే అవకాశం ఉండటంతో పాటు ప్రసవ సమయంలో సమస్యలు వస్తాయి.




## చర్మం ఆరోగ్యంగా, అందంగా కనిపించాలంటే ఖరీదైన క్రీములు అవసరం లేదు.. వీటిని తీసుకోండి చాలు..



చర్మం అందంగా, కాంతివంతంగా ఉండాలంటే ఖరీదైన క్రీములు లేదా సుదీర్ఘమైన స్కిన్‌కేర్ రొటీన్లు అవసరమని చాలా మంది భావిస్తారు. అయితే నిపుణులు చెబుతున్నది మాత్రం వేరే విషయం. మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారమే చర్మ ఆరోగ్యంపై అధిక ప్రభావం చూపుతుందని వారు తెలియజేస్తున్నారు. మొటిమలు, మసకబారిన చర్మం, డార్క్ సర్కిల్స్, పొడిబారిన చర్మం వంటి సమస్యలు చాలా సందర్భాల్లో శరీరంలో పోషక లోపాలను సూచిస్తాయని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో కొన్ని సాధారణ పదార్థాలను చేర్చడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఎలాంటి ఆహారాలను తీసుకోవాలో వారు తెలియజేస్తున్నారు.పచ్చి ఉసిరికాయ, స్పియర్‌మింట్ టీ..మసకబారిన చర్మానికి పచ్చి ఉసిరికాయ మంచి ఔషధంగా పని చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## భోజనం చేశాక ఈ మూడు రకాల గింజలను తినండి



భోజనం చేసిన తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్, అసిడిటీ, భారంగా అనిపించడం వంటి సమస్యలు చాలా మందిని వేధిస్తుంటాయి. ముఖ్యంగా ఆయిల్ ఎక్కువగా ఉన్న ఆహారం లేదా భారమైన భోజనం చేసినప్పుడు జీర్ణక్రియ నెమ్మదిగా మారుతుంది. ఇలాంటి సమస్యలకు సహజసిద్ధమైన పరిష్కారంగా సోంపు, వాము, జీలకర్ర గింజలను నమలాలని నిపుణులు సూచిస్తున్నారు. సరైన మోతాదులో ఈ గింజలను తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు పొట్ట అసౌకర్యాలు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. భోజనం తర్వాత ఈ మూడు గింజలను నమలడం భారతీయ సంప్రదాయంలో చాలా కాలంగా ఉంది. అయితే దీనికి శాస్త్రీయ కారణాలూ ఉన్నాయని ఆరోగ్య నిపుణులు వివరిస్తున్నారు. గింజలను నెమ్మదిగా నమలడం వల్ల వాటిలోని సహజసిద్ధమైన సంయోగాలు లాలాజలంతో కలిసి శరీరంలోకి చేరి జీర్ణక్రియను వేగవంతం చేస్తాయని చెబుతున్నారు.జీర్ణ సమస్యలకు అనేక కారణాలు..అసలు భోజనం తర్వాత జీర్ణక్రియ ఎందుకు నెమ్మదిస్తుంది అనే విషయాన్ని పరిశీలిస్తే, అధిక కొవ్వు, రిఫైన్ కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు పేగులు ఆహారాన్ని జీర్ణం చేయడానికి ఎక్కువ సమయం తీసుకుంటాయి.

# నివా బుపాపై ఐఆర్‌డీఏఐ వేటు...!




ప్రముఖ ఆరోగ్య బీమా సంస్థ 'నివా బుపా హెల్త్ ఇన్సూరెన్స్'కు బీమా నియంత్రణ మండలి 'ఐఆర్‌డీఏఐ' షాక్ ఇచ్చింది. రాబోయే ఆరు నెలల పాటు దేశవ్యాప్తంగా ఎలాంటి కొత్త బ్రాంచులు ప్రారంభించవద్దని కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఐఆర్‌డీఏఐ
ఇచ్చిన ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, తమ వాటాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చట్టపరమైన, వ్యాపారపరమైన చర్యలు తీసుకుంటామని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరించింది.
అయితే, కంపెనీ నడపడానికి ఐఆర్‌డీఏఐ ఎంతవరకు ఖర్చు చేయవచ్చని పరిమితి విధించిందో, 2024-25లో నివా బుపా ఆ హద్దులు దాటి ఎక్కువగా ఖర్చు చేసింది. అందుకే ఐఆర్‌డీఏఐ ఈ చర్యలు తీసుకుంది. కానీ, 2025-26 ఆర్థిక సంవత్సరంలోనూ, ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనూ (ఏప్రిల్-జూన్) తాము ఐఆర్‌డీఏఐ ఖర్చుల నిబంధనలను కచ్చితంగా పాటించామని కంపెనీ స్పష్టం చేసింది. ఇకపై కూడా ఈ నిబంధనలు దాటకుండా జాగ్రత్తగా ఉంటామని పేర్కొంది. ఈ పరిణామంతో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో కంపెనీ షేర్ ధరపై ప్రభావం కనిపించింది. బీఎస్ఈలో నివా బుపా షేర్ ధర దాదాపు 2 శాతం క్షీణించి రూ. 82.61 వద్ద ముగిసింది.ఐఆర్‌డీఏఐ ఇచ్చిన ఆదేశాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, తమ వాటాదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చట్టపరమైన, వ్యాపారపరమైన చర్యలు తీసుకుంటామని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వివరించింది.

# ఎల్‌పీజీ సరఫరాకు మరో దారి..!



వంట గ్యాస్ (ఎల్పీజీ) సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలగకుండా చూసేందుకు దేశీయ అతిపెద్ద ఇంధన సంస్థ 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్' (ఐఓసీ) కీలక అడుగు వేసింది. పశ్చిమాసియా దేశాలపైనే పూర్తిగా ఆధారపడటాన్ని తగ్గిస్తూ, అల్జీరియా ప్రభుత్వ రంగ సంస్థ 'సోనాట్రాచ్'తో 2027 నుండి ఎల్పీజీని దిగుమతి చేసుకునేందుకు దీర్ఘ కాలపరిమితి ఒప్పందాన్ని ఖరారు చేసే పనిలో ఉంది. ఈ ఒప్పందం ప్రకారం, ప్రొపేన్, బ్యూటేన్ మిశ్రమంతో కూడిన 45,000 నుండి 55,000 మెట్రిక్ టన్నుల ఎల్‌పీజీని ప్రతి నెలా భారీ షిప్పుల ద్వారా ఐఓసీ భారత్‌కు తరలిస్తుంది.
గతంలో సౌదీ అరామ్‌కో వంటి మధ్యప్రాచ్య సంస్థల నుండి కొనుగోలు చేసినప్పటికీ, అల్జీరియన్ ఎల్‌పీజీ ధర చాలా తక్కువగా ఉండటం ఐఓసీకి కలిసిరానుంది. ఇప్పటికే జూన్ నుండి అల్జీరియా గ్యాస్ దిగుమతిని ప్రారంభించిన భారత్, ఆగస్టులో దాదాపు 1.10 లక్షల టన్నులను అందుకోనుంది. హోర్ముజ్ జలసంధి వద్ద యుద్ధ పరిస్థితులు, రవాణా ముప్పు వల్ల దేశీయంగా ఎల్‌పీజీ కొరత రాకుండా ఉండేందుకు కేంద్రం సరఫరాదారుల పరిధిని విస్తరిస్తోంది. ఇందులో భాగంగానే 2027 నాటికి మనదేశ మొత్తం ఎల్‌పీజీ దిగుమతుల్లో 25 శాతం ఒక్క అమెరికా నుంచే పొందేందుకు ఐఓసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థలు ఉమ్మడిగా టెండర్లు పిలవనున్నాయి.
ఒకవైపు పైపుల ద్వారా సరఫరా చేసే సహజ వాయువును ప్రోత్సహిస్తూనే, మరోవైపు అల్జీరియా, అమెరికా వంటి ప్రత్యామ్నాయ దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా దేశంలో కోట్లాది ఇళ్లకు అవసరమైన వంట ఇంధన భద్రతను భారత్ బలోపేతం చేసుకుంటోంది.

# 40 ట్రిలియన్ డాలర్లు చేరిన అమెరికా అప్పు...




అమెరికా ఆర్థికవ్యవస్థపై అప్పుల భారం మునుపెన్నడూ లేనంత స్థాయికి చేరింది. ఆ దేశ జాతీయ అప్పు చరిత్రలోనే తొలిసారిగా 40 ట్రిలియన్ డాలర్ల మార్కును దాటినట్లు ట్రెజరీ డిపార్ట్‌మెంట్ అధికారికంగా వెల్లడించింది. రాబడికి మించి విపరీతంగా పెరిగిపోతున్న ప్రభుత్వ ఖర్చులు, పన్ను కోతలు, వడ్డీ భారం వల్ల తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ముంచుకొస్తోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అమెరికా ప్రభుత్వం వసూలు చేసే పన్నుల కంటే ఖర్చులే ఎక్కువగా ఉండటంతో ప్రతి ఏటా బడ్జెట్ లోటు పెరిగిపోతోంది. ప్రధానంగా వృద్ధాప్య జనాభా పెరగడం వల్ల సోషల్ సెక్యూరిటీ, మెడికేర్ వంటి సంక్షేమ పథకాల వ్యయం విపరీతంగా పెరిగింది.
దీనికి తోడు రక్షణ రంగానికి చేసే భారీ కేటాయింపులు, ట్రంప్ పాలనలోని పన్ను కోతల చట్టాలు ప్రభుత్వం వచ్చే ఆదాయాన్ని తగ్గించి, లోటును మరింత పెంచాయి. కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) అంచనా ప్రకారం, 2026 నాటికి అమెరికా బడ్జెట్ లోటు 1.9 ట్రిలియన్ డాలర్లకు చేరనుంది. ప్రస్తుతం పాత అప్పులు తీర్చడానికి, వడ్డీలు చెల్లించడానికే అమెరికా మళ్లీ కొత్తగా అప్పులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితి ఏర్పడింది. 2026 మొదటి 10 నెలల్లోనే నికర వడ్డీ చెల్లింపులు 963 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇది అమెరికా జాతీయ రక్షణ బడ్జెట్ కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం.
గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ ఆధిపత్యం వల్ల ప్రస్తుతానికి నిలదొక్కుకుంటున్నప్పటికీ, పెరిగిన వడ్డీ రేట్ల వల్ల ప్రభుత్వం కొత్తగా రుణాలు సేకరించడం మరింత ఖరీదైన విషయంగా మారింది. ఇది అమెరికా వెంటనే డిఫాల్ట్ అవుతుందని అర్థం కాకపోయినా, రుణ భారం వేగంగా పెరిగితే పెట్టుబడిదారులు అధిక రాబడులు డిమాండ్ చేసి, ఆర్థిక వ్యవస్థపై రుణ భారాలను మోపే ప్రమాదముందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

# పాతబస్తీకి నెరవేరనున్న మెట్రో కల


భాగ్యనగరంలోని పాతబస్తీ పుర వీధుల్లో పర్యటిస్తుంటే ఆసక్తికరమైన ఫ్లెక్సీలు కనిపిస్తుంటాయి. మూసీ నది దాటిన తర్వాత చారిత్రాత్మకమైన పాతబస్తీలో మెట్రో రైలు పనుల్లో భాగంగా కూలుస్తున్న నిర్మాణాల ముందు 'ఓల్డ్ సిటీ అంటే ఒరిజినల్ సిటీ' అంటూ పోస్టర్లలో కనిపించే నినాదాలు కార్యరూపం దాలుస్తున్నాయని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వం న్యూ సిటీతో పాటు ఒరిజినల్ ఓల్డ్ సిటీకి కూడా సమ ప్రాధాన్యతిస్తుందనే విశ్వాసం అక్కడి ప్రజల్లో కలుగుతోంది. నగరం నలువైపులా ఉన్న మెట్రో రైలును పాతబస్తీలో కూడా విస్తరింపచేసేందుకు పనులు వేగవంతం చేయాలని, భూసేకరణ వేగవంతం చేసి, త్వరలో టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించడంతో ఒరిజినల్ సిటీకి గుర్తింపు లభిస్తుందనే భరోసా పాతబస్తీ వాసుల్లో కలుగుతోంది. హైదరాబాద్ అభివృద్ధి కథలో పాతబస్తీకి మెట్రో రైలు అనుసంధానం చాలా కాలంగా అసంపూర్తిగా ఉన్న అధ్యాయం. గ్రేటర్‌లోని ఇతర ప్రాంతాల్లో మెట్రో పరుగులు తీస్తున్నా నగరంలో దాదాపు 25 శాతానికిపైగా జనాభా నివసించే పాతబస్తీలో మాత్రం మెట్రో అందుబాటులో లేకపోవడం పెద్ద లోటుగా మారింది.
నగరంలో రవాణా సౌకర్యాలను మెరుగుపర్చడంలో భాగంగా 2012లో మూడు మార్గాల్లో మెట్రో రైలు పనులు ప్రారంభమైనా వాటిలో జెబిఎస్ ఫలక్‌నుమా కారిడార్ అసంపూర్తిగా మిగిలిపోవడంతో పాతబస్తీ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఈ మార్గంలో ఎంజిబిఎస్ వరకు పనులు పూర్తయినా, అక్కడి నుంచి ఫలక్‌నుమా వరకు ఉన్న పాతబస్తీ భాగం మాత్రం అనేక కారణాలతో పెండింగ్‌లో ఉండిపోయాయి. పాతబస్తీ మెట్రో ఆలస్యానికి సాంకేతిక సమస్యలే కాకుండా సామాజిక, రాజకీయ సున్నితత్వం కూడా కారణమైంది. ఇక్కడి ఇరుకైన రహదారులు, భారీగా ఉన్న ఆస్తులు, మతపరమైన, వారసత్వ కట్టడాలు, భూసేకరణ వంటి సమస్యలతోపాటు స్థానిక రాజకీయ ఆధిపత్య
ధోరణులు కూడా అడ్డంకిగా నిలిచాయి. పాతబస్తీలో 103 మతపరమైన కట్టడాలు ఉన్నాయని, వాటి పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని మెట్రో మార్గాన్ని రూపొందించాల్సి వస్తుందని 2018లో నాటి ప్రభుత్వం వెల్లడించి చేతులు దులుపుకుంది. ఈ నిర్మాణాల్లో 21 మసీదులు, 12 ఆలయాలు, 12 ఆశూర్ఖానాలు, 33 దర్గాలు, 7 శ్మశాన/ సమాధి ప్రాంతాలు, 6 చిల్లాలు తదితర సున్నిత ప్రాంతాలు ఉన్నాయి.
ఇలాంటి పరిస్థితుల్లో మెట్రో స్తంభాలు, వయాడక్ట్ ఎత్తు, వంపులు, స్టేషన్ ప్రాంతాల రూపకల్పనలో మార్పులు చేస్తూ వీలైనంత వరకు మతపరమైన, వారసత్వ కట్టడాలను కాపాడే ప్రయత్నం చేశారు. దాదాపు అన్నింటినీ కాపాడేలా ఇంజినీరింగ్ పరిష్కారాలు రూపొందించారు. ఒక దశలో ప్రభావితమయ్యే నిర్మాణాల సంఖ్యను 18కు, ఆ తర్వాత ఇప్పుడు కేవలం నాలుగుకు తగ్గించగలిగారు. పాతబస్తీ మెట్రో విషయంలో హెరిటేజ్ పరిరక్షణ అంశం కీలకంగా మారి న్యాయస్థానం జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. పురావస్తు కట్టడాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపడుతున్నట్టు ప్రభుత్వం ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందిన హైకోర్టు నిర్మాణాల తొలగింపు పనుల నిలిపివేతకు ఆమోదించకుండా, మెట్రో నిర్మాణ పనులు కొనసాగించవచ్చని తీర్పు ఇవ్వడంతో మరింత వేగవంతంగా పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ అంశం కూడా పాతబస్తీలో పెద్ద సమస్యగా మారింది. చాలా ఆస్తులు చిన్నచిన్న వ్యాపార సంస్థలు, నివాసాలు, పాత భవనాలుగా ఉండటంతో భూసేకరణ ప్రక్రియ సులభంగా సాగలేదు. మెట్రో నిర్మాణానికి అవసరమైన రహదారి వెడల్పు, ఆస్తుల నష్టం, పరిహారం వంటి అంశాలపై స్థానికంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అందువల్ల రాజకీయంగా కూడా ఈ అంశం అత్యంత సున్నితంగా మారింది. ఒక ప్రభుత్వం ప్రణాళికలు ప్రకటించడం, మరో ప్రభుత్వం వాటిని పునఃసమీక్షించడం వంటి పరిణామాలతో పనులకు నిత్యం బ్రేకులు పడ్డాయి. ప్రభుత్వంలో చిత్తశుద్ధి ఉంటే పనులు పూర్తి అవుతాయని చెప్పడానికి సుల్తాన్ బజార్‌లో మెట్రో రైలు నిర్మాణమే నిదర్శనం.జెబిఎస్ ఫలక్‌నుమా మార్గంలో వ్యాపారాలకు కీలకమైన సుల్తాన్ బజార్‌లో కూడా పాతబస్తీవలే పలు అభ్యంతరాలు ఎదురైనా నాటి ప్రభుత్వం ముందుకెళ్లింది కానీ, అదే సమయంలో పాతబస్తీలో మాత్రం రాజకీయాల ఒత్తిడికి లొంగడంతో ఆ లైన్ ఎంజిబిఎస్ వరకే పరిమితమైంది. సమస్యలకు రాజకీయ రంగు పులమడం కంటే, వాటిని పరిష్కరించి పనులు పూర్తి చేయడమే ముఖ్యమన్న దిశగా ప్రస్తుత ప్రభుత్వం పాతబస్తీలో ముందుకు సాగుతుండడం ఆహ్వానించదగ్గ పరిణామం. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా పాతబస్తీ పనులను ప్రారంభించి భూసేకరణలో భాగంగా 90 శాతం వరకు కట్టడాలను విజయవంతంగా తొలగించగలిగింది.

# స్మార్ట్‌ఫోన్ ధరలకు మళ్లీ షాక్...




స్మార్ట్‌ఫోన్ తయారీలో కీలకమైన మెమరీ, చిప్‌సెట్ ధరలు విపరీతంగా పెరగడంతో ప్రముఖ ఫోన్ కంపెనీలు తగ్గిన లాభాల కాపాడుకునేందుకు ధరలు పెంచేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థికంగా ఆచి తూచి ఖర్చు చేస్తున్న వినియోగదారులకు శాంసంగ్, రియల్‌మీ, ఒప్పో, వివో, వన్‌ప్లస్ వంటి దిగ్గజ బ్రాండ్లు ఎంపిక చేసిన మోడళ్లపై భారీగా ధరలు పెంచి పెద్ద షాక్ ఇచ్చాయి. ఆగస్టు రెండో వారం తర్వాత నుంచి రియల్‌మీ రూ. 1,000 నుండి రూ. 4,000 వరకు, ఒప్పో రూ. 5,000 వరకు, అలాగే వన్‌ప్లస్ రూ. 4,000 వరకు ధరలను పెంచాయి. ఇక శాంసంగ్ ఏకంగా తమ గెలాక్సీ ఎస్25 వేరియంట్‌పై అత్యధికంగా రూ. 12,000 పెంచడం గమనార్హం. పెరిగిన ధరల వల్ల ఏప్రిల్-జూలై మధ్య స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే బాగా క్షీణించాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తెలిపింది. అమెజాన్ ప్రైమ్ డే, ఫ్లిప్‌కార్ట్ సేల్స్ సమయంలో కొంత అమ్మకాలు కనిపించినప్పటికీ, ఆఫర్లు ముగియగానే మళ్లీ మార్కెట్ పడిపోయింది. ఈ ఏడాది ప్రథమార్థంలోనే సగటు స్మార్ట్‌ఫోన్ ధరలు 15 శాతం పెరిగాయని, విడిభాగాల వ్యయం ఇలాగే కొనసాగితే రాబోయే నెలల్లో మరో 7-10 శాతం ధరలు పెరిగే అవకాశముందని ఐడీసీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వల్ల 2026లో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ దాదాపు 13 శాతం తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే రాబోయే పండుగ సీజన్లో కంపెనీలు ఇచ్చే ప్రత్యేక డిస్కౌంట్లు, నో-కాస్ట్ ఈఎంఐలు, ఫైనాన్సింగ్ ఆప్షన్లు మాత్రమే వినియోగదారులకు కొంత ఊరటనిచ్చి, మార్కెట్ పుంజుకోవడానికి సహాయపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఒరాకిల్‌లో ఉద్యోగాల కోతలు...!




టెక్ దిగ్గజ కంపెనీలలో ఒక్కటైన ఒరాకిల్ మరోసారి ఉద్యోగాల కోతలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు కొనసాగిస్తూనే ఉద్యోగుల వ్యయాన్ని తగ్గించేందుకు ఈ నెలలో కొత్త లేఆఫ్స్ చేపట్టాలని కంపెనీ యోచిస్తున్నట్లు ప్రముఖ నివేదిక వెల్లడించింది.బిజినెస్ ఇన్‌సైడర్ ప్రకారం.. ఒరాకిల్‌లో లేఆఫ్స్‌కు గురయ్యే ఉద్యోగులను గుర్తించాలని మేనేజర్లను కంపెనీ ఆదేశించింది. సెప్టెంబర్ 1న కంపెనీ రెండో ఆర్థిక త్రైమాసికం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. అంతకంటే ముందే ఈ ఉద్యోగాల కోతలను అమలు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని టీమ్‌లలో ఉద్యోగుల సంఖ్య రెండంకెల శాతంలో తగ్గే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.ఈ తాజా లేఆఫ్స్‌కు ముందు కూడా ఒరాకిల్ భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గించింది. 2026 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య సుమారు 21,000 మేర తగ్గింది. ఇది కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 13 శాతానికి సమానం. దీంతో ఒరాకిల్‌లో ఉద్యోగుల సంఖ్య సుమారు 1,41,000కు చేరుకుంది.మరోవైపు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఒరాకిల్ భారీగా ఖర్చు చేస్తోంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ఏఐ సంబంధిత మౌలిక సదుపాయాల కోసం కంపెనీ సుమారు 55.7 బిలియన్ డాలర్లు ఖర్చు చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ పెట్టుబడులకు మద్దతుగా కంపెనీ సుమారు 43 బిలియన్ డాలర్లను అప్పుగా తీసుకున్నట్లు సమాచారం.
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 40 బిలియన్ డాలర్లను డెట్, ఈక్విటీ ద్వారా సమీకరించాలని కూడా ఒరాకిల్ ప్రణాళికలు రూపొందించినట్లు తెలుస్తోంది. భారీగా పెట్టుబడులు పెడుతున్నప్పటికీ ఒరాకిల్ క్లౌడ్ వ్యాపారానికి డిమాండ్ కొనసాగుతోంది. ముఖ్యంగా ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా కంపెనీ క్లౌడ్ సేవల ఆదాయం గణనీయంగా పెరుగుతోంది.
అయితే ఏఐ మౌలిక సదుపాయాలపై కంపెనీ భారీగా చేస్తున్న ఖర్చులు పెట్టుబడిదారుల్లో ఆందోళనలకు కారణమవుతున్నాయి. ఈ ఏడాది ఒరాకిల్ షేర్లు గణనీయంగా పడిపోయినట్లు సమాచా రం. తాజా ఉద్యోగాల కోతలపై ఒరాకిల్ లేదా కంపెనీ ఉన్నతాధికారులు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఈ లేఆఫ్స్‌కు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

# తెలంగాణలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ జోరు...




ప్రముఖ బీమా సంస్థ 'ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్' తెలంగాణ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టర్మ్ ప్లాన్ వ్యాపారంలో ఏకంగా 60.7 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి తెలంగాణలో రూ. 11,708 కోట్ల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం), రూ. 1,52,016 కోట్ల మొత్తం సమ్ అస్యూర్డ్ కలిగి ఉన్న సంస్థ, రాష్ట్రంలో 6.56 లక్షలకు పైగా ప్రజలకు బీమా కవరేజీని అందిస్తోంది.
ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో 97 శాతం సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తూ, 99.3 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తితో కేవలం ఒక్క రోజులోనే విచారణ లేని క్లెయిమ్‌లను పరిష్కరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 11 సొంత బ్రాంచీలు, 3,934
పార్ట్‌నర్ బ్రాంచీలు, 6,100 మందికి పైగా అడ్వైజర్లతో విస్తృత నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నామని సంస్థ తెలిపింది. త్వరలో కంపెనీ పేరును 'ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్'గా మారనుందని, తెలంగాణ మార్కెట్లో డిజిటల్ సేవల ద్వారా మరింత విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించింది.

## అలా అనుకుంటే దానికి నేనేమీ చేయలేను: అర్జున్ దాస్



తన గంభీరమైన వాయిస్‌తో, విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న కోలీవుడ్ యంగ్ హీరో అర్జున్ దాస్, త్వరలోనే 'వన్స్ మోర్' చిత్రంతో రాబోతున్నారు. ఒకప్పుడు విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మెప్పించిన ఆయన, ఇప్పుడు హీరోగా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వంలో అదితి శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ రొమాంటిక్ డ్రామాకు హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 28న థియేటర్లలో విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్లలో పాల్గొన్న అర్జున్ దాస్ తన కెరీర్, వ్యక్తిగత జీవితం గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఆరంభంలో అందరూ తనకు కేవలం నెగెటివ్ రోల్స్ ఇచ్చేవారని ఆయన వెల్లడించారు. కథల ఎంపికలో వేరే పాత్రలు చేయాలనే ఉద్దేశంతో చాలాసార్లు ఆ ఆఫర్లను వద్దని చెప్పాల్సి వచ్చిందని, దానికి కొంత సమయం పట్టిందని తెలిపారు. ఆ తర్వాత అనుకోకుండా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రంలో నటించే అవకాశం దక్కిందన్నారు. ఈ ప్రయాణంలో తనకు అజిత్ కుమార్ తో ఉన్న అనుబంధం చాలా ప్రత్యేకమైనదని చెప్పారు.

ఒకప్పుడు అజిత్ సార్ దగ్గర ఒక సాధారణ ఉద్యోగిగా పనిచేసిన తాను, ఇప్పుడు ఆయనకు ఎదురుగా విలన్‌గా నటించే స్థాయికి ఎదగడం తన జీవితంలో దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఎమోషనల్ అయ్యారు. ఇక తన నిజ జీవిత స్వభావం గురించి మాట్లాడుతూ.. 'ఖైదీ' సినిమాలో తన క్యారెక్టర్ చూసి బయట కూడా చాలా సీరియస్‌గా ఉంటానని అందరూ అనుకుంటారని పేర్కొన్నారు. అయితే నేరుగా కలిస్తేనే తన అసలు స్వభావం ఏంటో తెలుస్తుందన్నారు. అంతేకాకుండా తన నిజ జీవితంలో కూడా తాను డ్రగ్స్ తీసుకుంటానని ఎవరైనా భావిస్తే, దానికి నేనేమీ చేయలేనని స్పష్టం చేశారు.

## ఆ సినిమాకు నో చెప్పి ఉంటే నా కెరీర్ వేరేలా ఉండేది: శ్రీ గౌరి ప్రియ



మెయిల్', 'రైటర్ పద్మభూషణ్', 'మ్యాడ్' వంటి సినిమాలతో మెప్పించిన శ్రీ గౌరి ప్రియకు ఇటీవల వచ్చిన 'చెన్నై లవ్ స్టోరీ' ఓ సరికొత్త మలుపునిచ్చింది. ఈ మూవీలో బ్రోకెన్ హార్ట్‌తో మద్యం సేవించే ఒక సవాలుతో కూడిన పాత్రలో నటించి ప్రశంసలు అందుకుంది. కిరణ్ అబ్బవరం సరసన ఆమె నటించిన ఈ క్లీన్ లవ్ స్టోరీ థియేటర్లలో రిపీట్ ఆడియెన్స్‌ను రాబట్టుకోవడమే కాకుండా, ఇప్పుడు ఆగస్టు 21 నుంచి 'సోనీ లివ్' ఓటీటీలో సందడి చేస్తోంది. ఈ నేపథ్యంలో.. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఎమోషనల్ కామెంట్స్ చేశారు. "నేను సికింద్రాబాద్‌లోనే పుట్టి పెరిగాను. చిన్నప్పటి నుండి థియేటర్లలో సినిమాలు చూస్తూ, పాటలు వింటూ పెరిగినదాన్ని. ఈ రోజు అదే ఇండస్ట్రీలో ఒక భాగం కావడం నా కల నిజమైనట్లుగా అనిపిస్తోంది. ఎంతోమంది అవకాశాల కోసం ప్రయత్నిస్తుంటారు, అలాంటిది దేవుడి దయ వల్ల నాకంటూ ఒక స్థానం దక్కడం చాలా ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోంది. 'చెన్నై లవ్ స్టోరీ' వచ్చాక ప్రజలు నన్ను వాళ్ళ ఇంట్లో మనిషిలా, ఒక చెల్లెలిలా భావిస్తున్నారు. ఆ సినిమాకు నో చెప్పి ఉంటే నా కెరీర్ వేరేలా ఉండేది. మొత్తానికి అదృష్టం కలిసొచ్చింది" అని చెప్పుకొచ్చారు. అలాగే ఈ సినిమాలో ఆ ఒక్క సీన్ చేయడం చాలా కష్టమైందని తెలుపుతూ.. "కథ విన్నప్పుడే ఈ ప్రాజెక్ట్‌కి ఒప్పుకోకపోతే నా లైఫ్‌లోనే పెద్ద తప్పు అవుతుందనిపించింది. ప్రేమ ఓటమితో బాధపడుతూ తాగుడికి అలవాటుపడే నివి అనే ఛాలెంజింగ్ రోల్‌ను నాపై నమ్మకంతో ఇచ్చినందుకు మేకర్స్‌కి థ్యాంక్స్. ముఖ్యంగా శ్మశానవాటికలో వచ్చే సన్నివేశం చేయడం శారీరకంగా, భావోద్వేగపరంగా చాలా కష్టమైంది.

సినిమా చూశాక నివి పాత్రలో మమ్మల్ని మేమే చూసుకున్నాం అని ప్రేక్షకులు మెసేజ్‌లు చేస్తుంటే నటిగా ఎంతో గౌరవం పెరిగినట్లు అనిపించిందని అన్నారు. థియేటర్లలో ఈ సినిమాని చాలామంది పదే పదే చూశారు. లవ్ స్టోరీలను ఆడియెన్స్ ఎలా తీసుకుంటారో చెప్పలేం, కానీ ఈ భావోద్వేగానికి అందరూ బాగా కనెక్ట్ అయ్యారని.. ఇప్పుడు ఆగస్టు 21 నుంచి 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ అవుతోందని చెప్పారు. ఇది తమకు రెండో రిలీజ్ లాంటిదని, థియేటర్లలో చూడనివారు ఓటీటీలో చూసి ఖచ్చితంగా ఆస్వాదిస్తారని శ్రీ గౌరి ప్రియ తెలిపారు.

# ఆద్యంతం ఆసక్తికరంగా ఉండే కథ..



రవితేజ నటించిన తాజా సినిమా 'ఇరుముడి'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో ఇందులో కీలక పాత్ర పోషించిన బేబీ నక్షత్ర మీడియాతో ముచ్చటించింది. నా పేరు నక్షత్ర. మాది కేరళ. నేను ఏడో క్లాస్ చదువుకుంటున్నాను. ఇప్పటివరకు కన్నడ, మలయాళం, తమిళ్ భాషల్లో కలిపి ఆరు సినిమాలు చేశాను. దర్శకుడు శివ నిర్వాణ ఇన్‌స్టాగ్రామ్‌లో నా రీల్స్ చూసి సంప్రదించారు. ఇది నా తొలి తెలుగు సినిమా కావడం చాలా ఆనందంగా ఉంది. ఇది అయ్యప్ప స్వామి నేపథ్యంలో ఉన్న కథ. రవితేజతో వర్క్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. ఆయన నాతో చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. ఇందులో నా పాత్ర పేరు మణికంఠ. నేను రవితేజ కూతురిగా కనిపించ బోతున్నాను.

ప్రియా నా తల్లి పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకి స్వయంగా డబ్బింగ్ చెప్పాను. ఈ సినిమాలోని పాటలన్నీ నాకు ఇష్టం. ముఖ్యంగా 'యాలో యాలో' పాట నా ఫేవరెట్. శివ నిర్వాణ సపోర్ట్‌తోనే ఈ సినిమాను చాలా కాన్ఫిడెంట్‌గా చేయగలిగాను. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది.

## 'ఇట్లు అర్జున' రిలీజ్ డేట్ ఫిక్స్



డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. అనీష్ హీరోగా, దర్శకుడిగా మహేష్ ఉప్పల పరిచయం అవుతున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. విడుదల తేదీని ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌లో అనీష్ స్టైలిష్ లుక్‌లో ఓ భవనం పైకప్పు నుంచి దూకుతూ ఏదో పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా కనిపిస్తుండగా, అనస్వర రాజన్ చేతులు కట్టబడి, విభిన్నమైన ఎక్స్‌ప్రెషన్‌తో కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినిమాకు ఇప్పటివరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌లో కనిపించిన లీడ్ పెయిర్ కెమిస్ట్రీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో అనీష్ చెవిటి, మూగ యువకుడి పాత్రలో నటిస్తున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన ఈ ప్రత్యేకమైన నేపథ్యం కథలో ఆసక్తికరమైన అంశాన్ని యాడ్ చేస్తోంది. ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రాజా మహాదేవ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రామ్ కుమార్ ఏ ప్రొడక్షన్ డిజైనర్‌గా, కోటి కే ఎడిటర్‌గా పని చేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలకు దిలీప్ సుబ్బరాయన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.


## 'రాధిమా' బ్రేకప్ సాంగ్ విడుదల తేది లాక్?



తక్కువ కాలంలోనే అద్భుతమైన సంగీత దర్శకుడిగా పేరు తెచ్చుకున్న వారిలో సాయి అభ్యంకర్ ఒకరు. ఇప్పటివరకు ఆయన సంగీతం అందించిన చిత్రాల్లో చాలా సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. అలాగే ఆయన సంగీతానికి కూడా అద్భుతమైన ప్రశంసలు దక్కాయి. దీంతో స్టార్ హీరోల చిత్రాలకు సంగీతం అందించే అవకాశాలు ఈ యువ సంగీత దర్శకుడికి తక్కువ కాలంలోనే ఎక్కువగా వస్తున్నాయి. సాయి అభ్యంకర్ కేవలం సినిమాలకు సంగీతం అందించడమే కాకుండా ఇండిపెండెంట్ సాంగ్స్ రూపొందించడానికి కూడా ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటికే పలు ఇండిపెండెంట్ సాంగ్స్‌కు సంగీతం అందించడంతో పాటు, వాటిలో నటించి ప్రేక్షకులను అలరించిన ఆయన.. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సేతో కలిసి 'రాధిమా' అనే ఇండీ సాంగ్‌కు సంగీతం అందించి, అందులో నటించారు. ఇది బ్రేకప్ సాంగ్‌గా రూపొందింది.

వైబ్రంట్ బీట్స్‌తో తెరకెక్కిన ఈ పాటను ఆగస్టు చివరి నాటికి విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. సాయి అభ్యంకర్ నుంచి వస్తున్న ఆరో ఇండీ సాంగ్‌గా ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. తన అద్భుతమైన సంగీతంతో ఆకట్టుకుంటున్న సాయి అభ్యంకర్, అలాగే తన అందం, నటనతో యువతను ఆకట్టుకుంటున్న భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన సాంగ్ కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. మరి ఈ ఇండీ సాంగ్ ప్రేక్షకులను ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.

## సొసైటీకి తప్పు మెసేజ్ ఇవ్వను..



లవర్ బాయ్‌గా ఫుల్ పాపులారిటీ దక్కించుకున్న సిద్ధార్థ్ నటించిన 'ఆపరేషన్ సఫేద్ సాగర్' అనే కొత్త వెబ్ సిరీస్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సిరీస్ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న సమయంలోనే ఆయన.. తాజాగా ఐటెమ్ పాటల సంస్కృతిపై తన పాత్రల ఎంపికపై చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. నటుడిగా తనకు కొన్ని సొంత నీతులు, పద్ధతులు ఉన్నాయని చెబుతున్నారు సిద్ధార్థ్. అందుకే సమాజానికి చెడు సందేశాన్ని ఇచ్చే ఐటెమ్ పాటల్లో ఎప్పటికీ నటించనని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఒక మహిళ చుట్టూ 40 మంది పురుషులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే పాటల్లో తాను నటించలేదని, అలాంటి సంస్కృతిని ప్రోత్సహించడం తన విధానం కాదని తెలిపారు. అంతేకాకుండా, తాను ఎల్లప్పుడూ కేవలం హీరో పాత్రలకే పరిమితం కావాలని అనుకోవడం లేదని వెల్లడించారు. ఒకవేళ హీరో పాత్రలోనే విపరీతమైన చెడు లక్షణాలు ఉంటే అలాంటి కథలను ఒప్పుకోనని తెలిపారు. కథ డిమాండ్ చేస్తే, సినిమాలో చివరికి నాశనమయ్యే క్రూరమైన విలన్ పాత్రలోనైనా నటించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. నటుడిగా సమాజానికి సరైన సందేశం ఇవ్వడమే తన మొదటి ప్రాధాన్యమని.. కానీ సొసైటీకి తప్పు మెసేజ్‌ను ఇవ్వనని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి.

## 'డిసి' తర్వాత హీరోగా లోకేష్ మరో మూవీ..



కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించి ఇండియావ్యాప్తంగా గుర్తింపును సంపాదించుకున్నారు. తాజాగా అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'డిసి' చిత్రంతో హీరోగా డెబ్యూ ఇచ్చారు. ఇటీవల విడుదలైన ఈ మూవీ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో లోకేష్ నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. దాంతో లోకేష్ హీరోగా కంటిన్యూ అయితే చాలా బెటర్ అని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. అయితే లోకేష్ మాత్రం దర్శకత్వం వహిస్తూనే హీరోగా కంటిన్యూ కావాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే హీరోగా తన తదుపరి మూవీని కూడా సెట్ చేసుకున్నట్లు సమాచారం. ఇక లోకేష్, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కబోయే ఓ చిత్రానికి దర్శకత్వం వహించడానికి రెడీగా ఉన్నారు. తాజాగా అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'డిసి' చిత్రంతో హీరోగా డెబ్యూ ఇచ్చారు. ఇటీవల విడుదలైన ఈ మూవీ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో లోకేష్ నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. దాంతో లోకేష్ హీరోగా కంటిన్యూ అయితే చాలా బెటర్ అని కొంతమంది అభిప్రాయపడుతున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాత లోకేష్‌కు 'డిసి' మూవీతో మంచి విజయాన్ని అందించిన అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో మరో సినిమా చేయబోతున్నట్లు తెలుస్తోంది. అయితే అల్లు అర్జున్‌తో సినిమా ప్రారంభం కావడానికి ఇంకా కాస్త సమయం పడుతుంది. దాంతో హీరోగా లోకేష్ నెక్స్ట్ మూవీ స్టార్ట్ కావడానికి ఈజీగా దాదాపు ఒక సంవత్సరం పట్టే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తాజాగా అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'డిసి' చిత్రంతో హీరోగా డెబ్యూ ఇచ్చారు. ఇటీవల విడుదలైన ఈ మూవీ భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ చిత్రంలో లోకేష్ నటనకు మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. దాంతో లోకేష్ హీరోగా కంటిన్యూ అయితే చాలా బెటర్ అని కొంతమంది అభిప్రాయపడుతున్నారు.

## ఇలాంటి సినిమా ఇప్పటివరకు రాలేదు...



అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన తొలి చిత్రం 'అమీర్ లోగ్'. రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. రానా దగ్గుబాటి సంస్థ స్పిరిట్ మీడియా ఈ మూవీని తెలుగులో నేడు (శుక్రవారం) గ్రాండ్‌గా రిలీజ్ చేయనుంది. ఈ సందర్భంగా దర్శకుడు రమణా రెడ్డి సోమ మాట్లాడుతూ,'ఈ సినిమాని ఇప్పటికి చాలా సార్లు చూశాం. కచ్చితంగా హిట్టు బొమ్మ. ఇప్పటి వరకు ఇలాంటి చిత్రం రాలేదు.

అలాంటి ఓ గొప్ప అటెంప్ట్ నేను చేశాను. ప్రీమియర్లకు వచ్చిన రెస్పాన్స్ చూస్తే మేం హిట్ కొట్టేశాం, మేం అనుకున్నది సాధించేశాం అని అర్థమైంది' అని అన్నారు. 'నన్ను ముందు నిలబెట్టి నడిపిస్తున్న నా భర్త రమణకి థాంక్స్. ఆయనే రైటర్, డైరెక్టర్, నిర్మాతగా అన్నీ పనులు చూసుకున్నారు.

ఆయన ఈ సినిమాని అందమైన పెయింటింగ్‌గా తీర్చిదిద్దారు. ఈ సినిమా చూసి బయటకు వెళ్లేటప్పుడు ప్రతీ ఒక్కరూ ఏదో ఒక ఎమోషన్‌ను ఇంటికి తీసుకు వెళ్తారు'అని నిర్మాత మాధవి రెడ్డి సోమ చెప్పారు. నటుడు ఎంసి హరి మాట్లాడుతూ,'ఈ సినిమా నాకు మంచి అవకాశాన్ని, కుటుంబాన్ని, అనుభవాన్ని ఇచ్చింది. ప్రీమియర్లు వేసిన ప్రతీ చోటా థియేటర్లు బ్లాస్ట్ అయ్యాయి. రిలీజ్ అయ్యాక మాకు అదే రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నాం' అని అన్నారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com